హైదరాబాద్ వార్త



## కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ఐక్యంగా కష్టపడాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 09, ప్రభాతవార్త :**
జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం, ప్రజా పాలన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెవెళ్లాలని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్‌ను ప్రకటించడంతో మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నవీన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అదేవిధంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన బూతుస్థాయి నుంచి నాయకులు కార్యకర్తలను ఐక్యంగా కలుపుకుని పోతూ విజయం సాధించేలా కష్టపడాలని సూచించారు. అనంతరం నవీన్‌యాదవ్ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనీలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తాను కాంగ్రెస్ పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా గెలుపే లక్ష్యంగా అందరిని కలుపుకుని పోతూ ముందుకు వెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు.



హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్.

# కలిసొస్తారా.. 'చేయి'స్తారా..!

## - ఆశావాహుల తీరుపై నెలకొన్న అనుమానాలు



**జూబ్లీహిల్స్, అక్టోబరు 9, ప్రభాతవార్తః**
కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు కొత్త తలనొప్పి వచ్చి పడింది. నిన్నమొన్నటి వరకు అభ్యర్థిత్వం విషయంలో ఆశావాహుల సంఖ్య చాంతాడంత లిస్టు ఉండగా ఎట్టకేలకు అధిష్టానం నవీన్‌యాదవ్ వైపు మొగ్గు చూపి ప్రకటించింది. ఇన్నాళ్లు టిక్కెట్ రేసులో పోటిపడిన మిగిలిన ఆశావాహు లు ఇప్పుడు కలిసొస్తారా..! లేక చేయిస్తారా..! అనే మీమాంస పార్టీ అధిష్టానాన్ని, అభ్యర్థిని వేధిస్తుంది. ముందు ఇళ్లు చక్కబెట్టే పనిలో ఇప్పుడు పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. మరోవైపు పార్టీలో టిక్కెట్ ఆశించి రాకపోవడంతో కొందరు నేతలు బాహా టంగానే ధిక్కార స్వరం వినిపించడంతోపాటు మరికొందరు నేతలు తమ అభ్యర్థిత్వానికి మద్దతిచ్చి ప్రయత్నించిన 'పెద్ద' నేతల వద్ద తమ అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టి చెబుతున్నారు. తా ము మద్దతిచ్చి గెలిపిస్తే రానున్న రోజుల్లో తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. దీంతో ఇప్పుడుపార్టీ నాయకత్వం సైతం సొంత ఇంటిలో దిద్దుబాటు చర్యలు చేపట్టే ప్రయత్నాలను ప్రారంభిస్తుంది.

### ముందకెళా వెళ్దాం

జూబ్లీహిల్స్ నియెఓజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్ ఆశించిన వారిలో ప్రధానంగా మాజీ ఎంపీ అంజన్ కుమార్‌యాదవ్, మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత గుర్రం మురళీగౌడ్, మహిళా నాయకురా లు ... జర్ల విజయలక్ష్మి తో పాటు పలువురు ఉన్నారు. వీరంతా టిక్కెట్ కోసం ఆశించడమే కాకుండా పెద్దఎత్తున ఖర్చు సైతం చేశారు. అంజన్‌కుమార్‌యాదవ్ తనకున్న స్వచ్ఛంద సంస్థ ద్వారా నియోజకవర్గంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఇక మిగిలిన నేతలు తమకు తెలిసిన సంఘాలతో సమావేశాలు నిర్వ హించి వారిని సంతృప్తి పరిచే ప్రయత్నం చేశారు. మిగిలిన నాయ కులంతా దాదాపుగా నియోజకవర్గం మొత్తం ఫ్లెక్సీలు వేసి బరిలో మేము ఉన్నామంటూ తేల్చిచెప్పారు. అయితే టిక్కెట్ రాకపోవడంతో ఇప్పుడు వీరంతా మద్దతిస్తారా లేదా అనేది ప్రశ్నగా మారింది.

### బుజ్జగింపుల బాధ్యత మంత్రులదే..!

పార్టీ టిక్కెట్ ఆశించి భంగపడ్డ నేతలను బుజ్జగించే పనిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యతలను పర్య వేక్షిస్తున్న మంత్రులకు అప్పగించే ఆలోచనలో ఉంది. వీరితోపాటు కాంగ్రెస్ నుంచి కీలకంగా ఉన్న కొంద రు నేతలు సైతం విముఖంగా ఉన్నారు. బయటికి అధిష్టానం నిర్ణయం అంటూ తేల్చిచెప్పినా లోలో పల తమ కార్యకర్తలు, అనుయాయులతో అవసరమై న మంత నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆశావాహులతోపాటు పార్టీలో ఉంటూ విముఖంగా ఉన్న నేతలను కలుపుకొని వెళ్లేందుకు అధినాయకత్వం మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, తుమ్మల నాగేశ్వర్‌రావులకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ గెలుపు బాధ్యతలను అప్పగించింది. వీరంతా చాలా కాలంగా స్థానికంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, కాలనీ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మమేకమై ఉన్నారు. ఈ క్రమంలోనే పార్టీ టిక్కెట్ ఆశించిన నేతలను ఇప్పుడు బుజ్జగించేందుకు వారినే రంగంలోకి దింపాలని భావిస్తున్నారు. రెబల్‌గా పోటీచేసేందుకు ఎవరూ ముందుకు రాకున్నా వారందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రచారంలో నవీన్‌యాదవ్‌కు తోడుగా నిలపాలని ఆలోచిస్తున్నారు. తద్వారా కలిసికట్టుగా ముందుకు తీసుకెళ్లి జూబ్లీహిల్స్‌లో పార్టీ జెండా పాతాలని ఆలోచిస్తున్నారు.

## బస్‌ఛార్జీల పెంపుకు నిరసనగా ఆర్టీసి బస్‌లో కెటిఆర్ ప్రయాణం



మారేడ్‌పల్లిలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావ్‌లతో బేటీ అయిన కేటీఆర్ తదితరులు

**కంటోన్మెంట్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** ఆర్టీసి బస్ ఛార్జీల పెంపును నిరసిస్తూ గురువారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల కేటీఆర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యేలు సమావేశమైయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వారిని హౌజ్ అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. పెంచి బస్ ఛార్జీలపై తాము ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేయడలేదని ఆర్టీసి క్రాస్‌రోడ్డులోని బస్ భవన్‌కు రేతి బస్టాప్ నుంచి బస్‌లో వెలుతామని చెప్పడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. బస్ ఛార్జీల పెంపునకు నిరసనగా బిఆర్ఎస్ చేపట్టిన ఛలో బస్ భవన్ కార్యక్రమం విజయవంతం అయింది. సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాప్ నుంచి కాచిగూడ డిపోకు చెందిన రూట్ 2 బస్‌లో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్‌లు కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమ నేతలు గజ్జెల నాగేశ్, మన్నెక్రిషాంక్, నర్సింహ్మా ముదిరాజ్, కార్పోరేటర్లు మహేశ్వరి, హేమలత,రాసూరి సునీత, లింగాని ప్రసన్న శ్రీనివాస్‌లతో పాటు బిఆర్ఎస్ కార్యకర్తలు తరలివెళ్ళారు. దీంతో మారేడ్‌పల్లి తలసాని నివాసం వద్దరేతిఫైల్ బస్టాంట్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బస్‌లో ఎక్కిన బిఆర్ఎస్ నశ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బస్ భనవ్‌కు తరలివెళ్ళారు.

## కాంగ్రెస్ రెండేళ్లుగా నిరంకుశ పాలన సాగిస్తుంది : హరీష్‌రావు

**నార్సింగి, అక్టోబర్ 9 ప్రభాతవార్త** : మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడలోని మాజీ మంత్రి హరీష్‌రావ్‌తో కలిసి బిఆర్ఎస్ నాయకులు బస్‌భవన్‌కు తరలివెళ్లారు. మెహిదీపట్నం వద్ద బస్సులో ఎక్కి టికెట్లు తీసుకొని బస్‌భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావ్ మాట్లాడుతూ ఆచరణకు సాధ్యపడని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండేళ్లుగా నిరంకుశ పాలన సాగిస్తుందని ఆరోపించారు. 420.హామీలు తుంగలో తొక్కి, మహిళలకు ఉచిత బస్సు అంటూ, మగవారికి డబుల్ చార్జీలు వసూలు చేయడం దారుణమని మండిపడ్డారు. ఆర్టీసి బస్సుల చార్జీలను అడ్డగోలుగా పెంచి ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారన్నారు. విద్యార్థుల బస్‌పాస్ ధరలు పెంచారని, రౌండ్ ఫిగర్ పేరిట పెంచారని, పండగల వేళ రెట్టింపు చేసి ప్రజల రక్తంను తాగుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య బద్ధంగా, రాజ్యాంగం కల్పించిన హక్కును ఉపయోగించుకోనివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ నాయకులను హౌస్ అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. బీఆర్ఎస్ బయటకు వచ్చి ఉద్యమిస్తే, నిజాలు ప్రజలకు తెలిసిపోతాయన్న భయం కాంగ్రెస్ ప్రభుత్వంలో కనిపిస్తుందని, అందుకే ముందస్తుగా బస్‌భవన్‌కు రాకుండా బిఆర్ఎస్ నాయకులను పోలీసులతో ఆపివేయించారన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, నాయకులు అండె లక్ష్మణ్‌రావ్, నరేందర్, సంగం శ్రీకాంత్, శ్రీశైలం, భానుచందర్, సుమనళిని, మహేందర్, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మీ, బాబురావ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో తనిఖీల్లో రూ. 9 లక్షలు పట్టివేత

**జూబ్లీహిల్స్, అక్టోబరు 9, ప్రభాతవార్తః**
ఎన్నికల నిబంధనల వేళ జూబ్లీహిల్స్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక వ్యక్తి అనుమానస్పదంగా తారసపడటంతో అతన్ని విచారించి అతని వద్ద రూ. 9 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. డబ్బు యజమానిని గుర్తించేందుకు ప్రయ్నతిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని విచారిస్తున్నారు.

## నగర వ్యాప్తంగా రోడ్‌సేఫ్టీ డ్రైవ్

### 13,738 గుంతలను పూడ్చిన జిహెచ్‌ఎంసి



రోడ్లపై గుంతలను పూడ్చివేస్తున్న జిహెచ్‌ఎంసి సిబ్బంది

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్డు భద్రత చర్యలలో భాగంగా గుంతల పూడ్చివేత పనులు, క్యాచ్ పిట్ రిపేర్‌లు, కవర్ రీప్లేస్‌మెంట్‌లు, సెంట్రల్ మీడియన్ మరమ్మతులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. అక్టోబర్ 9 గురువారం నాటికి నగరంలో మొత్తం 13,738 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. నిన్నటి వరకు 13,372 గుంతలను పూడ్చివేయగా, ఇవాళ ఒక్కరోజే 366 గుంతలకు మరమ్మతులు చేశారు. మిగిలిన గుంతలను వచ్చే వారం రోజుల్లో గా పూడ్చివేసేందుకు జిహెచ్‌ఎంసి ఇంజనీర్ విభాగం కృషి చేస్తుంది. కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ త్వరగా పూర్తి చేసేలా మార్గనిర్దేశనం చేస్తున్నారు.

## బాచుపల్లిలో కొండచిలువ కలకలం

### ఆందోళనలో అపార్ట్‌మెంట్‌వాసులు



**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద పోటెత్తిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పాములు, కొండచిలువలు, మొసళ్లు జనావాసాల్లోకి ప్రవేశించి, భయాందోళనకు గురి చేస్తున్నాయి. మొన్నటి వరకు మూసీ నది పరివాహక ప్రాంత ప్రజలకు మొసళ్లు, కొండచిలువలు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. తాజాగా బాపుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డి ల్యాబ్ సమీపంలోని ఓ ఆపార్టుమెంట్‌లో కొండచిలువ కలకలం సృష్టించింది. అపార్ట్‌మెంట్ రెండో అంతస్తులో కొండచిలువ ప్రత్యక్షమైంది. అపార్ట్‌మెంట్‌వాసులు కొండచిలువను చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్థానిక పోలీసులకు, సమాచారం ఇవ్వటంతో స్నేక్ సొసైటీ సభ్యులతో అక్కడికి చేరుకొని కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం అడవిలో వదిలేశారు. కొండచిలువను బంధించడంతో అపార్ట్‌మెంట్‌వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ ఏరియాలో ఉన్న అడవుల నుంచి కొండచిలువ జనవాసాల్లోకి వచ్చి ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికీ స్థానికులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను ఒంటరిగా బయటకు పంపొద్దని హెచ్చరించారు.

## విద్యుత్ మీటర్ కమర్షియల్..ప్రాపర్టీ టాక్స్ రెసిడెన్షియల్

- -జిఐఎస్ సర్వేతో 93వేల ప్రాపర్టీలను గుర్తించిన జిహెచ్‌ఎంసి
- -అసెస్‌మెంట్ చేయకుండా దాదాపు 70వేల భవనాలు
- -ఈఏడాది టాక్స్ వసూలు టార్గెట్ రూ.3 వేల కోట్లు
- -ఇప్పటి వరకు వసూలైంది రూ.1438 కోట్లు
- -మార్చి కల్లా పూర్తి చేసేలా ప్రణాళికలు




**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంసిలో ప్రాపర్టీ టాక్స్ చెల్లిస్తున్న 19.50లక్షల ఆస్తులపై చేపట్టిన జిఐఎస్ సర్వేతోపాటు కరెంట్ మీటర్లను లింక్ చేయడం ద్వారా ఒక్కో మోసం వెలుగులోకి వస్తుంది. జిహెచ్‌ఎంసి పరిధితో దాదాపు 93వేల ఆస్తుల యజమానులు కరెంట్ మీటర్లను కమర్షియల్‌గా వినియోగిస్తున్నప్పటికీ జిహెచ్‌ఎంసికి మాత్రం రెసిడెన్షియల్ ప్రాపర్టీ టాక్స్ చెల్లిస్తున్నట్లు గుర్తించారు. ఆస్తులను త్వరలోనే మూడేళ్ల కమర్షియల్ టాక్స్‌ను విధించి నోటీసులు జారీ చేసేందుకు జిహెచ్‌ఎంసి రంగం సిద్దం చేసింది. అలాగే ఈభవనాలు ఎందుకు పన్ను పరిధిలోకి రాలేదో లోతుగా పరిశీలించి, సిబ్బంది నిర్లక్ష్యం ఏమైనా ఉంటే చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్దమవుతున్నారు. అలాగే ఆయా భవనాల వినియోగాన్ని భట్టి వాటిని చెల్లింపు పరిధిలోకి తీసుకువచ్చి ఏకంగా మూడేళ్ల టాక్స్‌ను వడ్డించాలని జిహెచ్‌ఎంసి భావిస్తుంది. ఈభవనాలన్ని కమర్షియల్ టాక్స్ పరిధిలోకి తీసుకురావడం ద్వారా అదనంగా రూ.400 నుంచి 500కోట్లు వరకు పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

### ఈఏడాది టార్గెట్ 3వేలకోట్లు..

జీహెచ్‌ఎంసీ ప్రధాన ఆర్థిక వనరైన ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ ను వర్తమాన ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో పెంచుకునేందుకు అధికారులు వ్యూహం సిద్దం చేశారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో రూ. 2200 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ ను లక్ష్యంగా పెట్టుకోగా, చివరి నిమిషం వరకు రూ. 2038 కోట్లు వసూలయ్యాయి. ప్రతి ఆర్థిక సంవత్సరం వసూలైన మొత్తం ప్రాపర్టీ ట్యాక్స్ కు అదనంగా రూ. 200 కోట్ల నుంచి రూ. 300 కోట్ల వరకు టార్గెట్ పెంచుకుని ట్యాక్స్ స్టాఫ్ ట్యాక్స్ కలెక్షన్ చేస్తుండేది. కానీ ఈ వర్తమాన ఆర్థిక సంవత్సరం ఏకంగా రికార్డు స్థాయిలో రూ. 3 వేల కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ ను వసూలు చేసుకోవాలని అధికారులు ప్లాన్ చేస్తున్నారు. అంటే గత ఆర్థిక సంవత్సరం రూ. 2038 కోట్లు వసూలు కాగా, ఈ సంవత్సరం ఏకంగా రూ. 962 కోట్ల భారీ టార్గెట్ ను అధికారులు ఫిక్స్ చేసుకున్నారు. గత ఏప్రిల్ మాసం నుంచి ఈ నెల 8వరకు రూ. 1348 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు కాగా, గతేడాదితో పోల్చితే రూ. 103 కోట్లు అదనంగా వసూలైనట్లు అధికారులు వెల్లడించారు. లక్ష్యాన్ని చేరేందుకు మిగిలిన రూ. 1652 కోట్ల ట్యాక్స్ వచ్చే మార్చి నెలాఖరు కల్లా వసూలు చేసేలా సిటీలోని 30 సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లకు, ట్యాక్స్ ఇన్ స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లకు టార్గెట్లు ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు ప్రతి నెల 30 సర్కిళ్ల నుంచి రూ. వంద కోట్ల వరకు ట్యాక్స్ వసూలు చేయాలన్న నిబంధన ప్రస్తుతం అమల్లో ఉండగా, దీన్ని సవరించి మొత్తం సర్కిళ్ల నుంచి ప్రతి నెల రూ. 200 కోట్ల వరకు ట్యాక్స్ వసూలు చేయాలంటూ ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిసింది. అలాగే సిటీలోని మొత్తం 30 సర్కిళ్లలో శేరిలింగంపల్లి ఇప్పటి వరకు ఈ నెల 7వ తేదీ సాయంత్రం వరకు రూ. 214 కోట్ల ట్యాక్స్ కలెక్షన్ చేసి, టాప్ వన్ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానంలో జూబ్లీహిల్స్ సర్కిల్ రూ. 125 కోట్లు వసూలు చేయగా, ఖైరతాబాద్ 98 కోట్లు వసూలు చేసినట్లు, ఇక కలెక్షన్ లో చివరి స్థానంలో ఫలక్ నుమా సర్కిల్ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

### మాల్స్ పై ఫోకస్..

సిటీలోని అన్ని సర్కిళ్లల్లో ఉన్న మాల్స్ పై ట్యాక్స్ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సర్క్యులర్ జారీ చేసినట్లు సమాచారం. ముఖ్యంగా సర్కిళ్ల పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, ట్యాక్స్ ఇన్ స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు తమ పరిధిలోని మాల్స్‌కు నేరుగా వెళ్లి, మాల్స్ ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తున్నాయా? లేదా? అన్న విషయాన్ని నిర్ధారించుకోవాలని, ఒక వేళ ట్యాక్స్ చెల్లింపు పరిధిలో లేని పక్షంలో వెంటనే వాటిని ట్యాక్స్ చెల్లింపు పరిధిలోకి తీసుకురావాలని, ఆ మాల్స్ లోని అన్ని వ్యాపార సంస్థలను కూడా ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి తీసుకురావాలని కమిషనర్ సర్క్యులర్ లో ఆదేశించినట్లు తెలిసింది.

## నిండు ప్రాణానికి రెండు చుక్కలు

### -జిల్లాలో 12 నుండి 15 వరకు పల్స్ పోలియో కార్యక్రమం : జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:** నిండు ప్రాణానికి రెండు చుక్కలు అని పోలియో రహిత సమాజమే మన ముందున్న లక్ష్యమని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుండి ఈ నెల 12 నుండి 15 వరకు నిర్వహించే పల్స్ పోలియో నిర్వహణ కార్యక్రమంపై జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 12న హైదరాబాద్ లోని 2843 కేంద్రాల్లో పోలియో5 పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. 5 సంవత్సరాల పిల్లలకు పోలియో వ్యాధి నివారణకు రెండు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమంలో 5,17,238 మంది పిల్లలకు పోలియో చుక్కలు అందించనున్నామని స్పష్టం చేశారు. నగరంలో 9,36,016 ఇండ్లల్లో ఉన్న 05 సంవత్సరాల గల పిల్లలకు కవర్ చేయడం జరుగుతుందని అన్నారు. పోలియో కేంద్రాలు ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు తెరచి ఉంటాయని అలాగే తేదీ 13, 14, 15 లలో 11,200 మంది వైద్య సిబ్బంది ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ లో 164 హైరిస్క్ ఏరియాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. అపార్ట్మెంట్లు, గృహాలలో ఉండే 05 వయస్సు గల పిల్లలున్న తల్లి



దండ్రులు తమ పరిధిలో ఉన్నటువంటి పల్స్ పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, వాలంటీర్స్, పారా మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, డి ఎం ఓ రాములు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

### ఎంసిసి ఉల్లంఘనలపై వేగంగా స్పందించాలి : ఆర్.వి.కర్ణన్



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఆర్.వి.కర్ణన్ ,హేమంత్‌కేశవ్ పాటిల్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:**
ఎన్నిక ముగిసే వరకూ అప్రమత్తంగా ఉండాలనీ కంట్రోల్ రూమ్ బాధ్యులు, సిబ్బందని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశించారు. ఈమేరకు గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో గురువారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కంట్రోల్ రూంను జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ ఆర్ వి కర్ణన్ ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, విజిలెన్స్ అదనపు ఎస్పీ , నోడల్ అధికారి నరసింహారెడ్డి, మీడియా నోడల్ అధికారి దశరథం, సిఐ అమృత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్వేచ్ఛాయుత ,పారదర్శక ఎన్నికల నిర్వహణలో ఎంసీసి కంట్రోల్ రూమ్ ముఖ్య భూమిక పోషించాలని జిల్లా ఎన్నికల అధికారి అన్నారు. కంట్రోల్ రూమ్ కు వచ్చేఎన్నికల ప్రవర్తన నియమవళి ఉల్లంఘన ఫిర్యాదుల పై సత్వరమే స్పందించాలన్నారు. ఎంసీసీ ఉల్లంఘనలు జరిగినట్లు సమాచారం అందినవెంటనే క్షేత్రస్థాయి ఎన్నికల బృందాలులను అప్రమత్తం చేయాలన్నారు.

## స్కూల్ బస్సులో మంటలు..తప్పిన పెను ప్రమాదం

**అడ్డగుట్ట, అక్టోబర్ 9 ప్రభాతవార్త:**
సికింద్రాబాద్ ఏఓసి సెంటర్ నుంచి మహేంద్రహిల్స్‌లో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు వెళ్తున్న స్కూల్ బస్‌లో హఠాత్తుగా మంటలు చెలరేగిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం ఏఓసి సెంటర్ మార్గంలో వెళ్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్ మహేంద్ర హిల్స్ వెళ్తుండగా అకస్మాత్తుగా బస్‌లో నుంచి పొగలు, మంట లు చెలరేగడంతో అప్రమత్తమైన స్కూల్ బస్ డ్రైవర్ బస్‌లో ఉన్న విద్యార్థులను కిందకు దింప డంతో నప్రాణాపాయం తప్పింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అం దించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, ఆర్మీ జవాన్లు,ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొ ని మంటలను అదుపు చేశారు. విద్యార్థులను మరో బస్‌లో స్కూల్‌కు పంపించారు. ఈ కేసును తిరుమలగిరి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. షాట్ సర్క్యూట్‌తో బస్ దగ్ధమైనట్లు పోలీసులు భావిస్తున్నారు.



స్కూల్ బస్సులో చేలరేగిన మంటలను ఆర్పితున్న ఆర్మి పోలీసులు

## 'గో సంసద్' కార్యక్రమాన్ని ప్రారంభించిన చతుర్వేది



సమావేశంలో మాట్లాడుతున్న మహంత్. చిత్రంలో చతుర్వేది, తదితరులు

**సైఫాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గోవుల సంరక్షణ కోసం 'గో సంసద్' కార్యక్రమాన్ని గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వేదిక్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రారంభించింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరేంద్రకుమార్ చతుర్వేది ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గోవుల రక్షణ కోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అలాగే కేంద్ర ప్రభుత్వం గోమాతను జాతీయ ప్రాణిగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో 'గో ఎంపి'లను నియమిస్తామని, అలాగే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'గో ఎమ్మెల్యే'లను కూడా నియమిస్తామని చెప్పారు. ప్రతి గో ఎమ్మెల్యే తన పరిధిలో 'రామ గోశాలను' ప్రారంభిస్తారని, ఆదే విధంగా తాలుకా, గ్రామ పంచాయితీ స్థాయిల్లో నియామకాలు కొనసాగేలా ప్రణాళికను రూపొందించామని చెప్పారు. తద్వారా గో మాత రాష్ట్ర మాతగా సందేశం ప్రతి పౌరుడు వరకు చేరుతుందన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ గో ఎంపిగా మహంత్ శ్రీయోగి దాస్‌ను చతుర్వేది నియమించారు. ఈ సమావేశంలో మమత చతుర్వేది, శివరామ్‌ప్రసాద్, వినయ్‌శర్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు కవిత, కథ, నాటికల పోటీలు

**: తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. ఎన్.బాలాచారి**

**రవీంద్రభారతి, అక్టోబరు 9 ప్రభాతవార్త :** నవంబరు 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సాహిత్య అకాడమీ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు పద్యం/ కవిత/ గేయం/ కథ/ నాటికల పోటీ నిర్వహిస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి తెలిపారు. ఈ క్రింది నిబంధనలను పాటిస్తూ రచనలను కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమీ, రవీంద్రభారతి ప్రాంగణం, కళాభవన్, హైదరాబాద్-500 004 చిరునామాకు నవంబరు 5వ తేదీలోగా అందేటట్లు పంపాలని ఆయన పేర్కొన్నారు. నిబంధనలు : పద్యం/కవిత/గేయం 25 పంక్తులకు; కథ ఎ4 సైజులో 3పుటలకు; నాటిక ఎ4 సైజులో 6పుటలకు; విద్యార్థులు స్వీయరాతతో ప్రతీ పేజీకి 20 పంక్తులకు మించకుండా వ్రాయాలి. రచనపైన విద్యార్థి పేరు, పాఠశాల పేరు వంటి సమాచారం ఉండరాదు. కేవలం శీర్షిక మాత్రమే ఉండాలి. దేశభక్తి, దేశ సమగ్రత, తెలంగాణ వైశిష్టం, సంస్కృతి-సంప్రదాయాలు, పర్యావరణం-పచ్చదనం లాంటి అంశాలు తమ రచనలలో ఉండాలి. విద్యార్థి రచన శీర్షిక, అది పద్యం/కవిత /గేయం/కథ/నాటికనో తెలుపుతూ విద్యార్థి పూర్తిపేరు, తండ్రిపేరు, చదువుతున్న తరగతి మొదలైన వివరాలు పాఠశాల ప్రధానాచార్యులు ధృవీకరించేపత్రంలో మాత్రమే ఉండాలి. ఇందులో ధృవీకరిస్తున్న వారి ఫోన్ నంబరు, చిరునామా తప్పనిసరి అని అకాడమీ కార్యదర్శి డా. ఎన్.బాలాచారి స్పష్టం చేశారు.

## క్రీడలు విద్యార్థులలో విజయకాంక్షను పెంచుతాయి

**- గండిపేట మండల విద్యాధికారి సునీల్ కుమార్**



గండిపేట మండలంలో 69.వ, ఎస్‌జిపి క్రీడల టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఇఓ సునీల్ కుమార్ దృశ్యం.

**నార్సింగి, అక్టోబర్ 9 ప్రభాతవార్త :** క్రీడలు విద్యార్థులలో విజయకాంక్షను పెంచుతాయని గండిపేట మండల విద్యాధికారి సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం 69.వ,ఎస్‌జిపి క్రీడల టోర్నమెంట్‌ను ఎంఇఓ విద్యార్థులకు కరచాలనం చేసి ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో మండలంలోని 250.మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఎంఇఓ సునీల్ కుమార్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఆటలు ఆడిన వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. ఆటల వలన మనలో గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించే గుణం పెరుగుతుందని, మనలోని తప్పులను సరిదిద్దుకొని, గెలుపు కోసం కష్టపడటం అలవాటు అవుతుందన్నారు. ఆటలు ఆత్మ విశ్వాసంను పెంచుతాయని తెలిపారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జోనల్ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామని ఎంఇఓ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి, పిడి జ్యోత్స్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్సీసెల్ వర్కింగ్ చైర్మన్‌గా నియమితులైన హరికృష్ణ



రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ వర్కింగ్ చైర్మన్‌గా నియామక పత్రంను అందుకుంటున్న జి.హరికృష్ణ.

**నార్సింగి, అక్టోబర్ 9 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ వర్కింగ్ చైర్మన్‌గా జి.హరికృష్ణ నియమితులయ్యారు. గురువారం రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ ప్రీతం, ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ల చేతుల మీదుగా హరికృష్ణ నియామక పత్రంను అందుకున్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర నాయకులు నాపై ఉంచిన నమ్మకాన్ని మరింత పెంచుకునేందుకు రేయింబవళ్లు కష్టపడుతానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలానికి తిరిగి నాయకులు, కార్యకర్తలను చైతన్యవంతులను చేస్తానని, అధిష్టానం ఆదేశించే ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శక్తివంచన లేకుండా శ్రమిస్తానని స్పష్టం చేశారు. పార్టీ ఉంటేనే నాయకులం ఉంటామని, పార్టీని భూత్ స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. వచ్చే సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలో అధిక స్థానాలు కాంగ్రెస్ గెలిచేలా కార్యాచారణ రూపొందించుకొని, వచ్చే వారం నుంచే పనులు ప్రారంభిస్తామని హరికృష్ణ స్పష్టం చేశారు. నాకు ఈ బాధ్యత వచ్చేందుకు సహకరించిన పెద్దలందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

## ఉద్యోగుల సమస్యల సాధన కోసం పోరాడుతాం:టిఎన్‌జిఓ



కార్యవర్గసమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎంఎస్ ముజీబ్

**గన్‌ఫౌండ్రి, అక్టోబరు 9, ప్రభాతవార్త:** ఉద్యోగుల పెండింగ్ సమస్యల సాధనకోసం టిఎన్‌జిఓ సంఘంఅనునిత్యం పోరాడుతుందని టిఎన్‌జిఓ కేంద్రసంఘం ప్రధానకార్యదర్శి, కన్వీనర్ డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ, కోకన్వీనర్ కస్తూరి వెంకట్‌లు పేర్కొన్నారు. ఈమేరకు తెలంగాణ నాన్‌గజిటెడ్ రంగారెడ్డిజిల్లా కార్యవర్గసమావేశం జరిగింది. సమావేశంలో కేంద్రసంఘం కోశాధికారి సత్యనారాయణగౌడ్, ఉపాధ్యక్షులు పర్వతాలు, ఈశ్వర్, పూర్వ అధ్యక్షులు ఆర్.లక్ష్మన్‌లతో పాటు యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నేతల అరెస్ట్

**-పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలి**
**-చలో బస్ భవన్ సందర్భంగా బిఆర్ఎస్ నేతల అరెస్ట్**
**-కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసులు అడ్డంకులు**



ఎమ్మెల్యే ముఠాగోపాల్, యువనేత ముఠాజైసింహ్



ఎమ్మెల్సీ శంబీపూర్ రాజును అరెస్టు చేస్తున్న పోలీసులు



బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



పోలీసు స్టేషన్‌లో కార్పొరేటర్లు

**చిక్కడపల్లిలో...**

**చిక్కడపల్లి, అక్టోబరు 9, ప్రభాతవార్త:** పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ డిమాండ్‌చేశారు. పెంచిన బస్‌చార్జీలు తగ్గించాలని డిమాండ్‌చేస్తూ బిఆర్ఎస్ చలో బస్‌భవన్ కార్యక్రమాన్ని చేపట్టిన సందర్భంగా ఆర్టీసి బస్సులో నియోజకవర్గంలోని వివిధ డివిజన్‌లకుచెందిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆర్టీసి బస్ భవన్‌కు బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహాతో కలిసి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచితంగా బస్ చార్జీలను పెంచి ప్రజలపై తీవ్రభారం మోపిందని మండిపడ్డారు. ప్రయాణీకుల ఇబ్బందులను పట్టించుకోని ప్రభుత్వం వారిపై అదనంగా భారంమోపడం ఏమిటని ప్రశ్నించారు. సామాన్యులపై భారంమోపేలా పెంచిన బస్‌టికెట్ ఛార్జీలను తక్షణం తగ్గించాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గం డివిజన్ ప్రెసిడెంట్లు రాకేష్‌కుమార్, శంకర్ ముదిరాజ్, శ్యామ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, వై.శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శులు మీడియా ఇన్చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, సీనియర్ టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**దుండిగల్‌లో...**

**దుండిగల్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు నివాసాన్ని గురువారం ఉదయమే పోలీసులు చుట్టుముట్టి హౌస్ అరెస్ట్ చేశారు. శాంతియుతంగా జరగాల్సిన ప్రజా కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను ఉల్లంఘించిందని శంబీపూర్ రాజు తీవ్రంగా స్పందించారు. పెంచిన ఆర్టీసిచార్జీలపై ప్రజలకు జవాబు చెప్పలేని ప్రభుత్వమే ఈవిధమైన అణచివేత చర్యలకు దిగుతోందని వారు విమర్శించారు. బిఆర్ఎస్‌పార్టీ తలపెట్టిన చలో బస్‌భవన్ కార్యక్రమం ప్రజలవాణిని వినిపించేందుకు, ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన ఉద్యమం అని శంబీపూర్ రాజు తెలిపారు. అయినా పోలీసులుచేసిన హౌస్ అరెస్ట్‌తో తాము వెనక్కితగ్గబోమని, ప్రజాహక్కుల కోసం బిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టంచేశారు.

**కెపిహెచ్‌బి కాలనీలో...**

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బిఆర్‌యస్‌పార్టీ తలపెట్టిన చలో బస్‌భవన్ కార్యక్రమంలో భాగంగా ముందస్తుగా కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా ఇంటికి వెళ్లి ఆయనను ముందస్తుగా అరెస్ట్ చేయంతోపాటు అతని అనుచరులైన పాతూరి గోపీ, రాజేష్‌రాయ్, దినేష్ నాయుడులను కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు.

**పేట్‌బషీరాబాద్‌లో...**

**పేట్‌బషీరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ తలపెట్టిన చలో బస్‌భవన్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. గురువారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, కార్య నిర్వహణ అధ్యక్షుడు కెటిఆర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుల పిలుపు మేరకు 132 డివిజన్ నుండి బిఆర్ఎస్ పార్టీ నాయకులు బస్ భవన్ ముట్టడికి బయలుదేరారు. వారిని సుచిత్ర బస్‌స్టాప్‌లో పోలీసులు మోహరించి, అదుపులోకి తీసుకుని స్టేషన్ తరలించారు. అరెస్ట్ అయినవారిలో 132 డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంట సిద్ధిరాములు, వార్డ్‌మెంబర్ జి.సుధాకర్, ఉద్యమనాయకుడు సమ్మయ్య నేత, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు బచ్చ జ్ఞానేశ్వర్, బిఆర్ఎస్ యూత్‌నాయకుడు నదీమ్‌రాయ్, చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులను అరెస్ట్‌చేసి పోలీసులు స్టేషన్‌కి తరలించారు.

**అల్వాల్‌లో...**

**అల్వాల్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ చలో బస్‌భవన్ పిలుపును పురస్కరించుకుని కార్పొరేటర్లను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయమే అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌లను వారి ఇంటినుంచి అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వరకు స్టేషన్‌లోనే ఉన్న అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టు అయిన కార్పొరేటర్లలో సీనియర్ నేతలు అనీల్ కిషోర్, విజయ్, శేఖర్, జావిద్, మహేష్, సాజిద్, జామ, పరమేష్ తదితరులు ఉన్నారు.

# రైల్వేస్టేషన్ దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

**-హైదరాబాద్ ఐఆర్‌పి బి.ప్రవీణ్‌కుమార్**




నిందితులను చూపిస్తున్న బి.ప్రవీణ్‌కుమార్, జి.సాయికుమార్, ఎ.శ్రీనివాస్, షకీల్‌పాషా, తదితరులు

**నాంపల్లి, అక్టోబరు 9, ప్రభాతవార్త:** హైదరాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ దోపిడీ కేసులో ప్రమేయమున్న ఇద్దరు నిందితులను లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రభుత్వ, రైల్వేపోలీసులు అరెస్టు చేసినట్లు ఐఆర్‌పి హైదరాబాద్ బి.ప్రవీణ్‌కుమార్ మీడియా సమావేశంలో తెలిపారు. ఈమేరకు నేడు గురువారం ఉదయం 9గంటల ప్రాంతంలో బి.ప్రవీణ్‌కుమార్ తన సిబ్బంది జి.సాయికుమార్, ఎ.శ్రీనివాస్, షకీల్‌పాషా, ఐపిఎఫ్/ఆర్‌పిఎఫ్ తదితర సిబ్బందితో కలిసి లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో నేరస్థులు, అనుమానితుల కోసం సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారణలో నిందితుల వివరాలను వెల్లడించారు. నిందితుల్లో ఏ1 మైనోద్దీన్ షేక్, ఏ2 అజీమ్‌గౌస్ షేక్ ఇద్దరూ మహారాష్ట్ర రాష్ట్రం లాతూర్ నివాసులని తెలిపారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ 6వ తేదీ రాత్రి 11.30గంటలకు లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోని ఫ్లాట్‌ఫాం నంబరు 2 చివరిలో ఒంటరిగా వస్తున్న ఒక వ్యక్తిని బెదిరించి, కొట్టి, అతని వద్దనున్న 10వేల రూపాయల విలువైన పోకో మొబైల్, 300 రూపాయల నగదును దోచుకొని పారిపోయారని చెప్పారు. వీరు ఈరోజు ఉదయం 11.10గంటలకు లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోని ఫ్లాట్‌ఫాం నంబరు 1 వద్ద వేచివుండా పోలీసులు వారిని పట్టుకున్నారు. ఐఆర్‌పి హైదరాబాద్ ఇద్దరు సాక్షుల సమక్షంలో కేసు నమోదుచేసి అతని వద్దనుండి దొంగిలించిన 10వేల పోకో మొబైల్, 300 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. సికిందరాబాద్ రైల్వేస్ పోలీస్ సూపరింటెండెంట్ చందనదీప్తి ఐపిఎస్, డిఎస్ఆర్పీ సికిందరాబాద్ అర్బన్ ఎస్.ఎన్.జావేద్ పర్యవేక్షణలో బి.ప్రవీణ్‌కుమార్, రవి, వారి సిబ్బంది సహకారంతో నిందితులను అరెస్టు చేశారు. రైల్వేస్-రోడ్‌సేఫ్టీ హైదరాబాద్, తెలంగాణ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కె.రమేష్‌నాయుడు, ఆర్పీఎస్ హైదరాబాద్ అధికారులు, సిబ్బందిని అభినందించి వారికి తగిన రివార్డులు అందజేయబడతాయని తెలిపారు.

## మద్యం షాపుల లైసెన్స్ పొందేందుకు దరఖాస్తుల స్వీకరణ

**అఫ్జల్‌గంజ్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** దూల్‌పేట ప్రొహిబిషన్‌అండ్‌ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలో 2026-2027 సంవత్సరానికి మద్యంషాపుల నిర్వహణకు లైసెన్స్‌పొందడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దూల్‌పేట ప్రొహిబిషన్ అండ్‌ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె.మధుబాబు తెలిపారు. డిసెంబర్1వ తేది నుంచి ప్రారంభమయ్యే రిటైల్ మద్యంషాపుల నిర్వహణకు కొత్తలైసెన్సులను పొందడానికి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఆస్తకిగల 21సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలిగినవారు ఎవరైనా మూడులక్షల రూపాయలు నాన్‌రిఫండబుల్ డిడి లేదా, చలానా చెల్లించి ఈనెల 18వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వారికి రెండు సంవత్సరాల పాటు లైసెన్సు చెల్లుబాటు అవుతుందన్నారు. గతంలో ఉన్న 12 మద్యం షాపులకు 11కు తగ్గించినందువల్ల వ్యాపారం మరింత పెరిగే అవకాశాలు ఉన్నందువల్ల ఈసారి పోటీ అధికంగా ఉంటుందన్నారు. హైదరాబాద్‌జిల్లాకు సంబంధించిన మద్యం షాపుల దరఖాస్తులు నాంపల్లిలోని అబ్కారీభవన్‌లోని నాలుగవ అంతస్తులో స్వీకరించడం జరుగుతుందన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్ఓ ప్లాంట్



ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రమేష్, పద్మావతి, సుజయ్‌థామస్‌లు

**బేగంపేట, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం డెల్ టెక్నాలజీ సహకారంతో వెయ్యి లీటర్ల ఆర్ ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు.డెల్ టెక్నాలజీస్ సహకారంతో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వుమెన్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ(డబ్ల్యుఅండ్ఏఐ) కార్యక్రమాన్ని అమలుచేస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆ శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన గవర్నమెంట్ డిగ్రీకాలేజీ(మహిళలు) బేగంపేట విద్యార్థినులకు లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈవిద్యాసంవత్సరంలో గవర్నమెంట్ డిగ్రీకాలేజీ బేగంపేట వివిధవిభాగాలకుచెందిన 360మంది విద్యార్థినులు ఈకార్యక్రమం ద్వారా శిక్షణపొందారు. కార్యక్రమంలో డెల్ టెక్నాలజీ ప్రతినిధులు విద్యార్థినులు రూపొందించిన సృజనాత్మక ఏ ఓన్ ప్రాజెక్టులను అభినందించారు. వీటిలో ఏవన్ ఇమేజ్ ఎడిటింగ్ టూల్, బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపువ్యవస్థ, పవన్ బివన్ డాష్ బోర్డు వంటి ప్రాజెక్టులు ఉన్నాయి.

## గుంతల మూలంగా గోషామహల్‌లో డ్రైనేజీ సమస్య



గోషామహల్ స్టేడియంలో పనులను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

**గోషామహల్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** గోషామహల్ పోలీస్‌స్టేడియంలో నూతనంగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం కొరకు భూసారపరీక్షలకు తవ్వుతుండగా మురికినీటి పైపులైన్ పగిలిపోవడంతో గోషామహల్ పరిసర ప్రాంతాలల్లో డ్రైనేజీసమస్య ఉత్పన్నమైంది. దీంతో స్థానిక ప్రజలు జలమండలి అధికారులపై ఆగ్రహంవ్యక్తంచేశారు. ఈసమస్య తీరని పక్షంలో గోడేకబర్‌లోని జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించడంతో డి.జి.ఎం శ్రీనివాస్‌రావు, మేనేజర్ గురునాథ్ తనసిబ్బందిని గోషామహల్ గ్రౌండ్‌కు వెళ్లి పరిశీలించారు. కొత్తగా గ్రౌండ్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి కాంట్రాక్టర్ ప్రోక్లెన్లు పెట్టి సమాంతరంగా చేయడంతోపాటు,భూసార పరీక్షల కోసం మట్టిని సేకరిస్తున్నారు. గోషామహల్ పోలీస్ గ్రౌండ్ ఆనుకుని ఉన్న బస్తీ పైపులైన్లు గ్రౌండ్‌లోపలి నుంచి ఉండటం మూలంగా పనులుచేపట్టే సమయంలో పైపులైన్లు పగిలిపోయి పరిసరప్రాంతాలలో మురికినీరు రహదారులపై పారుతుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేయడంతో పనులు జరుగుతున్న స్థలానికిచేరుకుని మరమ్మతులు చేయించారు. అంతకుముందు జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించడంతో విషయం తెలుసుకున్న గోషామహల్ ఎస్ఐలు శిరీష, అంతోధ్యయ పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.

## మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

**జూబ్లీహిల్స్, అక్టోబరు 9, ప్రభాతవార్తః** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం విడుదలచేసిన రిటైల్ మద్యం దుకాణాల కేటాయింపు నోటిఫికేషన్‌లో భాగంగా తమపరిధిలో సైతం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జూబ్లీహిల్స్ ఎక్సయిజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖ సిఐ వాసుదేవరావు తెలిపారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, వెంగళ్‌రావునగర్, రహమత్ నగర్‌లో ఉన్న 18 మద్యందుకాణాలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. అక్టోబరు 18వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని, 23న లాటరీ తీయనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 8712659638 నంబరులో సంప్రతించాలని ఆయన సూచించారు.

## బాణాసంచాల దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

**-ఈ నెల 15వరకు తుదిగడువు**

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** దీపావళి నేపథ్యంలో బహిరంగ రోడ్లకిరువైపుల ఏర్పాటయ్యే బాణసంచాల దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ పేర్కొన్నారు. ఈ నెల 15వరకు సమర్పించేందుకు తుదిగడువు ఉందని వివరించారు. అయితే దరఖాస్తుతోపాటు డివిజనల్ ఫైర్ అధికారి ఎన్ఓసి పత్రం, స్థలయజమాని అనుమతి, జిహెచ్ఎంసి అనుమతి, గతేడాది లైసెన్స్, పొరుగువారి ఎన్ఓసి పత్రాలు, దుకాణం స్థలప్రింట్, రూ.600చలాన్‌తో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. సంబంధిత పత్రాలు లేకుంటే స్వీకరించబడవని ఆయన తెలిపారు.

## సాంస్కృతికోత్సవానికి తెలుగురాష్ట్రాల విద్యార్థులకు ఆహ్వానం

**నాంపల్లి, అక్టోబరు 9, ప్రభాతవార్త:** జాతీయ బాలలదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బాలల సాంస్కృతికోత్సవం నిర్వహిస్తున్న పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య తెలిపారు. ఈమేరకు నవంబరు 23న హైదరాబాద్‌లో ఉభయ తెలుగురాష్ట్రాలకు సంబంధించిన 6నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన చెప్పారు. వివిధ రంగాల్లో రాష్ట్ర, జాతీయస్థాయిల్లో అద్భుతాలు సృష్టించి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్న బాల మేధావులు తమ అనుభవాలు పంచుకుని తోటి విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తారు. ఇందుకు సంబంధించి పోటీలు వివిధ అంశాలపై రెండురకాలుగా జరుగుతాయని చెన్నయ్య పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రాంతాల నుండే వ్రాసి పోటీకి పంపవచ్చు. 2 పేజీలకు మించకుండా కథ, 20 పంక్తులకు మించకుండా వచన కవిత్వం, 5 పద్యాలకు మించకుండా పద్యకవిత పోటీకి రచనలు, చిత్రలేఖనం పోటీకి తమకిష్టమైన చిత్రాలుగీసి పంపవచ్చునని వివరించారు. అవి ఈ నెల 31లోగా తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, బొగ్గులకుంట, హైదరాబాద్-500 001 చిరునామాకు పంపాలని తెలిపారు. ఈబాలల సాంస్కృతికోత్సవంలో పాల్గొనగోరే బాలబాలికలు 96303727234 వాట్సాప్ నంబరుకు తమ పేరు, తరగతి, పాఠశాల, ఊరి పేరు తదితర వివరాలు పంపాలని చెప్పారు. పోటీల్లో పాల్గొనకపోయినా ప్రతినిధులుగా పాల్గొనదలచినవారు, పోటీల్లో పాల్గొనేవారు ఈ నెల 31వ తేదీలోగా వేరువేరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య కోరారు.

## గవాయ్‌పై దాడి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై జరిగినట్లే

**-సిఆర్ఐ జాతీయ అధ్యక్షుడు డా.బాబురావు ఆరోపణ**




సభలో మాట్లాడుతున్న డా.బాబురావు, చిత్రంలో విజిఆర్ నారగోని

**సైఫాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి. ఈదాడిని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా సివిల్ రైట్స్ ఇనిషియేటివ్ ఇంటర్నేషనల్ (సిఆర్ఐ) జాతీయ అధ్యక్షుడు, విశ్రాంత ఐపిఎస్ అధికారి డా. బాబురావు కోరారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈదాడి కేవలం భౌతిక మైనది మాత్రమే కాదని దేశంలో రోజురోజుకు న్యాయపాలన పట్ల పెరుగుతున్న అసహనం, భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చడానికి జరుగుతున్న కుట్రలో భాగంగానే గవాయ్‌పై దాడిజరిగిందని ఆరోపించారు. గవాయ్ దళితుడైనందు వల్లనే దాడి జరిగిందని, రోజురోజుకు ముస్లింలు, క్రైస్తవులు, ఇతర మైనార్టిలపై దాడులు జరుగుతున్నాయని, దేశాన్ని హిందూదేశంగా మార్చేందుకు ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలైన బిజెపి, బజరంగదళ్, విహెచ్‌పి తదితర సంస్థలు కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే చేస్తున్నాయని చెప్పారు. ఈ సభలో బిషప్ సంజయ్ ఆనంద్, కె.బి.శ్రీధర్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌విపిఈఐ కేంద్రాల్లో వృద్ధులకు సమగ్ర ఆరోగ్యసేవలు

**బంజారాహిల్స్, అక్టోబరు 9, ప్రభాతవార్తః** ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞానసంస్థ(ఎల్‌విపిఈఐ) ఆధ్వర్యంలో వృద్ధులకు సమగ్ర ఆరోగ్యసేవలు అందిస్తున్నట్లు వృద్ధుల కంటిసంరక్షణ విభాగాధిపతి డాక్టర్ అవినాష్ పతెంగే తెలిపారు. వృద్ధులదినోత్సవం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొన్నామన్నారు. బంజారాహిల్స్‌లోని కేంద్రంతోపాటు విశాఖపట్నంలోని జిఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్, భువనేశ్వర్‌లోని మిథుతుల్సి చన్‌రాయిరెడ్డి క్యాంపస్, విజయవాడలోని కోడె వెంకటాద్రి చౌదరి క్యాంపస్, కడపలోని రాజశేఖరరెడ్డి క్యాంపస్‌లలో వృద్ధుల కంటి సంరక్షణకు సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ ఐసిఓపిఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జ్ఞాపకశక్తి, చలనం, పోషణ, దృష్టి, వినికిడి, ఒత్తిడి తదితర సమస్యలను స్క్రీన్‌చేసి ప్రారంభ సమస్యలను గుర్తించి అవసరమైన వైద్యసాయం అందిస్తామన్నారు.

## ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి మృతి

**కంటోన్మెంట్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** సికింద్రాబాద్,కంటోన్మెంట్ వెస్ట్‌మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న తెలంగాణ ఉద్యమనేత ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి విజ్జయ్య 76 గురువారం సిద్ధిపేటలోని గంగాపురం తమ స్వగ్రామంలో మృతిచెందారు. విషయంతెలుసుకున్న మాజీ సిఎం కెసిఆర్, మాజీమంత్రులు కెటిఆర్, హరీష్‌రావ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలిపారు. అదేవిధంగా ఎర్రోళ్ల శ్రీనివాస్ అభిమానులు, బిఆర్ఎస్‌నేతలు ఎం.షర్వీన్, కిరణ్, పెంట శ్రీహరిలు విజ్జయ్య భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం వుంచి శ్రద్ధాంజలి ఘటించారు.

## మహ్మద్ సమిద్దీన్‌కు ఐదురోజుల జైలుశిక్ష

**బేగంబజార్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై అనుచితంగా వ్యవహరించిన ఆటో డ్రైవర్‌కు ఇ-పెట్టీ కేసులో ఐదురోజుల జైలుశిక్ష విధించారు. ఈసంఘటన గోషామహల్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం, జుమ్మేరాత్‌బజార్ వద్ద బిసి పెట్రోల్ పోలీసుబృందం విధులను నిర్వహిస్తున్నారు. సైదాబాద్ సింగరేణికాలనీ ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ సమీద్దీన్(25)ను అనుమానంతో పోలీసులు నిలిపి, వాహనానికి సంబంధించిన పత్రాలను చూపించాలని కోరారు. అందుకు పోలీసులతో అనుచితంగా వ్యవహరించడంతో, సమీద్దీన్‌ను అదుపులోకి తీసుకుని నాంపల్లిలోని స్పెషల్ జ్యుడిషీయల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మహ్మద్ సమీద్దీన్‌కు ఇ-పెట్టి కేసు కింద సెక్షన్ 61(బి)సిపి చట్టం కింద నేరం చేసినందుకు ఐదురోజుల జైలుశిక్షను విధించారు. ఈ కేసును గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బిసి రిజర్వేషన్‌లపై ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలతోనే హైకోర్ట్ స్టే విధించింది

### - ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 9, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో జీ.వో.నెం.9ను శాస్త్రీయ పద్ధతిలో కాకుండా తమకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించడం వల్లే హైకోర్టు స్టే ఇవ్వాల్సి వచ్చిందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వ విధానం శాస్త్రీయంగా, సరిగ్గా లేదని బిఆర్ఎస్ పార్టీ తరపున అసెంబ్లీ వేదికగా మా నాయకులు, మేము ఎన్నోసార్లు ప్రభుత్వానికి హితవు పలికామని, రేవంత్ సర్కార్ మాత్రం మా సలహాలను, సూచనలను పెడచెవిన పెట్టడం వల్లే నేడు హైకోర్టులో స్టే విధించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుతో పాటు అనేక హామీలను కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సాక్షి గా ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు కావస్తున్న బీసీ రిజర్వేషన్ల అమలు, వారికి ఇచ్చిన హామీల అమలులో తూతూ మంత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్పా హామీల అమలులో ప్రభుత్వానికి ఎటువంటి చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కామారెడ్డి వేదికగా బిసి డిక్లరేషన్ అమలు విషయంలో అఖిలపక్షం సభ్యుల సూచనలను, సలహాలను పెడచెవిన పెట్టకుండా శాస్త్రీయబద్ధంగా రూపొందించాలని, లేకపోతే వెనుకబడిన వర్గాల తరపున పోరాడేందుకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

## మంచి నీటి కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే



బోర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

**అల్వాల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** వెంకటాపురం పాత బస్తీ వాసులు మంచి నీటి కష్టాలు తీరాయి. బస్తీలోని ప్రభుత్వానికి చెందిన బోర్ కొంత కాలం క్రితం పాడైంది. బస్తీ వాసులు విషయాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే జలమండలి అధికారులకు సమాచారం ఇవ్వడంతో బస్తీలో కొత్త బోర్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేత అనీల్ కిషోర్ ఇతరులు పాల్గొన్నారు.

## కంటి చూపు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం



కంటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

**సికింద్రాబాద్, అక్టోబర్ 9 ప్రభాతవార్తః**

ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని, కంటి చూపు జాగ్రత్తలపై గాంధీ ఆసుపత్రిలో కంటి విభాగం వైద్య బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. శరీరంలో కంటిని కాపాడుకోవడం ఎంతో ప్రధానమైందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీ డాక్టర్ రవి శేఖర్‌రావు, డాక్టర్ దీపక్‌రెడ్డి, డాక్టర్ సుజని, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ సింధూ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్సు..పురుషులకు రెట్టింపు వసూళ్లు

### : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్,కార్పొరేటర్ విజయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకొని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించిన దృశ్యం

**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:**

ఆర్టీసీ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే దాకా బీఆర్ఎస్ పోరాటం అగదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై పోరాడితే అసహనంతో కాంగ్రెస్ పార్టీ అక్రమంగా అరెస్టులు చేస్తూ బీఆర్ఎస్ గొంతు నొక్కాలన్ని ప్రయత్నిస్తోందని అన్నారు. ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా 'చలో బస్ భవన్' కార్యక్రమానికి వెళ్లకుండా న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అనంతరం అక్కడి నుంచి పోలీసులు అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు కల్పించి..పురుషులకు రెట్టింపు వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. ఒక్కో కుటుంబంపై టికెట్ ధరల భారం పెరిగిందన్నారు. ఆర్టీసి బస్సు పాసుల ధరలు 25 శాతం పెంచారు. మెట్రో నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీని తరిమేశారు. మెట్రో, ఆర్టీసి లేకుండా మొతనతం ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ప్రజల సమస్యలపై పోరాడితే అసహనంతో కాంగ్రెస్ పార్టీ అక్రమంగా అరెస్టులు చేస్తూ బీఆర్ఎస్ గొంతు నొక్కాలన్ని ప్రయత్నిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మ, బిఆర్ఎస్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫలక్‌నుమా కాళిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు


ఫలక్‌నామా కాళిమాత ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఏఐసిసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:**

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అమ్మవారి దయ దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఏఐసిసి జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం వెంగళరావునగర్‌కాలనీ నుంచి పలువురితో కలసి ఫలక్‌నామా కాళిమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, గురునాథరావు, కుటుంబరావు, నాళం రాజు, భరత్‌కుమార్, మహేష్ కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## 13 న సుద్దాల పురస్కారాల ప్రదానోత్సవం : సుద్దాల అశోక్ తేజ

**చిక్కడపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** సుద్దాల జానకమ్మ హనుమంతు సాహితి, జానపద, నృత్య పురస్కారాల ప్రదానోత్సవం ఈ నెల 13న సాయంత్రం 6 గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య కళా నిలయంలో అత్యంత ఘనంగా అందజేస్తున్నట్లు ప్రముఖ సినీ గేయ రచయిత, సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దాల అశోక్ తేజ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. ఈ సంవత్సరం ఈ పురస్కారాలను ప్రముఖ రచయిత్రి శ్రీమతి ఓల్గా, ప్రముఖ జానపద, సినీ గాయని మధుప్రియ ,ప్రముఖ నర్తకి లాలినిధికి పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి సునంద, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ రఘు, సుద్దాల సుధాకర్ తేజ తదితరులు పాల్గొంటారని తెలిపారు సభకు ముందే నాట్య ప్రదర్శనలు నృత్య రూపకాలు చైతన్య కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా సుద్దాల అశోక్ తేజ గారు మాట్లాడుతూ తెలంగాణ నేల


సుద్దాల పురస్కారాల ప్రదానోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్ తేజ

సాలు మీద పాటలతో విత్తనమైన నా తల్లిదండ్రులు జానకమ్మ హనుమంతు నా తండ్రికి మా అమ్మ ఇరువైపులా పాటై..పాటల పల్లకి పి మోసిందని అన్నారు. 13 సంవత్సరాలుగా నాన్న పేరు మీద ఈ సంవత్సరం అమ్మ పేరు మీద పేరు అమ్మలకు సాహితీ, జానపద, నృత్య ముగ్గుర మ్మలకు పురస్కారాలను అందజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సుద్దాల సుధాకర్ తేజ, సుద్దాల నిర్మల తెలంగాణ బాలోత్సవం కార్యదర్శి ఎన్ సోమయ్య తదితరులు పోస్టర్ ఆవిష్కరణ సభ పత్రిక విలేఖరుల సమావేశంలో పై విషయాలు ప్రకటించారు

## ప్రముఖ పోరాట యోధుడు, ధైర్యశాలి చెగువేరా

**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ప్రముఖ పోరాట యోధుడు, ధైర్యశాలి, మూర్తిభవించిన మానవత్వం కలిగిన మహనీయుడు చెగువేరా అని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) నాయకులు చెప్పారు. ఈ మేరకు ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన చేగువేరా 58వ వర్ధంతి కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడారు. క్యూబాలో జన్మించిన చేగువేరా కేవలం తన దేశానికే కాకుండా ఆనేక దేశాలలో పర్యటించి పెట్టుబడిదారి వ్యవస్థపై అలుపెరగని పోరాటం చేశారని వారు తెలిపారు. వంద పండ్లను ఒక్కడే దాచుకోవడం క్యాపిటలిజం–ఉన్నదాంట్లో అందరూ పంచుకోవడం కమ్యూనిజం అని చెప్పిన చేగువేరా మాటలు ప్రజా ఆకాంక్షలకు అద్దం పడుతుందన్నారు. అమెరికన్ సా


చేగువేరా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

మ్రాజ్యావాదానికి వ్యతిరేకంగా చేగువేరా ఆనేక పోరాటాలను నిర్వహించారని వారు వివరించారు. నేటి ప్రపంచానికి పోరాట పటిమని చూపుతున్నది ఆయనేనని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు కాంపల్లి కళ్యాణ్, అరుణ్, సుశాంత్, ప్రతిమ, రమ్య, శాంతి, ఫాతిమా, ప్రతిప్, నదీమ, ప్రభాకర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వారు చేగువేరా చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.

## భగ్గుమన్న బిసి సంఘాలు


రిజర్వేషన్ వ్యతిరేక దిష్టిబొమ్మ దగ్ధం చేసిన దృశ్యం

**హైదరాబాద్ అక్టోబరు 9 ప్రభాతవార్త:** ప్రభుత్వం జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే విధించడంతో బీసీ సంఘాలు భగ్గుమన్నాయి. గురువారం బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు వేమ రామకృష్ణ ఆధ్వర్యంలో రిజర్వేషన్ వ్యతిరేక దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. 79 ఏళ్లుగా బీసీలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేస్తూనే ఉన్నాయని, మరో సారి బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల సాధన కోసం దేశ రాజధానిలో ఢిల్లీలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తే తప్ప సమస్యకు పరిష్కారం లభించేలా లేదన్నారు. ఈ విషయంలో గతంలో తమిళనాడు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జయలలితను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో జూనియర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నందగోపాల్, వంశీకృష్ణ, రేణుక పాల్గొన్నారు

## డిప్యూటీ ఇఎన్‌సి, ఎస్ఇని కలిసిన కూన శ్రీశైలం గౌడ్


**కొంపల్లి, అక్టోబర్ 9, ప్రభాతవార్త**

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఊర చెరువు సుందరీకరణ అలాగే దూల్లపల్లి ఎన్ టి ఆర్ విగ్రహం నుండి ఇండస్ట్రియల్ ఏరియా వరకు సరైన రోడ్డు మార్గం లేక గుంతలు ఉండటం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విషయాన్నీ తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ గురువారం తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ఇఎన్ సి నర్సింహా రెడ్డి, ఎస్ ఇ వెంకటేశ్వర్‌లను కలిసి దూలపల్లి ప్రజలు, వాహనదారులు పడే ఇబ్బంది తెలియజేసి, బిటి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ఇఎన్ సి నర్సింహా రెడ్డి, ఎస్ ఇ వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించి తక్షణ మంజూరుకు సహకరిస్తాం అని తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సమావేశంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఈనాటి ధ్యేయాలు-ఆనాటి గేయాలు' గ్రంథావిష్కరణ

**చిక్కడపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** పివిఎం ఫౌండేషన్, సర్వార్థ సంక్షేమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో పివి. మనోహరరావు రచించిన 'ఈనాటి ధ్యేయాలు–ఆనాటి గేయాలు' గ్రంథావిష్కరణ సభ 12న నగరంలోని రవీంద్ర బారతిలో నిర్వహించబోతున్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ వ్యవస్థాపక కార్యదర్శి ఉమ్మడిసింగ్ రాఘవరావు (రఘుశ్రీ) సహకారంతో జరిగే ఈ కార్యక్రమానికి ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని, సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వెల్దండ నిత్యానందరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్సీ సురభివాణిదేవి, గ్లోబల్ పీవీ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు పివి.ప్రభాకరరావు, విశ్రాంత లెక్చరర్ బి.శ్రీనివాసరావు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య పి.గౌరీశంకర్, ఉస్మానియా వర్సిటీ ఫ్యాకల్టీ ఓరియెంటల్ డీన్, పూర్వ ఇంచార్జ్ డాక్టర్ బి.జయరాములు, ఆధ్యాత్మికవేత్త నందూరి బంగారయ్య శర్మ, సర్వార్థ సంక్షేమ సమితి ప్రతినిధి పివి.మదన్‌మోహన్, పి.వి.రాజమోహన్(కిరణ్) తదితరులు పాల్గొంటారు.

## కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి : ఎమ్మెల్యే కేపీ


బోరబండ బాబా సైలాని నగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 9, ప్రభాతవార్త :**

గత రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి, నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి దివంగా మాగంటి గోపీనాథ్ చేసిన సేవలు మరువలేనివని బోరబండ ఇంచార్జ్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బోరబండ డివిజన్ పరిధిలోని బాబా సైలానినగర్‌లో బూతు స్థాయి నుంచి నాయకులు కార్యకర్తలతో కలిసి బస్తీలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ మోసం చేశారని ఈ సారి ఉప ఎన్నికల్లో ప్రజలను మోసం చేసేందుకు మరోమారు ప్రజల్లో తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులకు బాకీ కార్డులు చూపించి ఎన్ని పథకాలు అమలుపర్చారో ప్రశ్నించాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలన్నా ప్రజా సంక్షేమం జరగాలన్నా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్‌ను గెలిపించుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కృష్ణమోహన్, స్థానిక నాయకులు కురమయ్య, పుల్లయ్య, దాసు, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల రుసుంలో 50శాతం రాయితీ ఇవ్వాలి : శ్యామ్‌కుమార్

**చిక్కడపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 2025–2027 సంవత్సరానికిగాను మద్యం దుకాణాల ఏర్పాటులో రిజర్వేషన్ ఉన్న దుకాణాల దరఖాస్తు రుసుములో 50శాతం రాయితీ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని జాతీయ మానవహక్కుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సిరిగిరి శ్యామ్ కుమార్ కోరారు. రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదే అంశంపై రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషన్‌కు వినతిపత్రాన్ని సమర్పించడం జరిగిందన్నారు. ఆబ్కారి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన మద్యం దుకాణాల ఏర్పాటులో గౌడ కులస్తులకు 15శాతం ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 5శాతం రిజర్వేషన్ ఖరారు చేసిన విషయం తెలిసింది. అదే మాదిరిగా రిజర్వేషన్లు ఉన్న దుకాణాలకి ఒకే దరఖాస్తు రుసుము రిజర్వేషన్లు, లేని దుకాణాలకి ఒకే దరఖాస్తు రుసుము అమలు చేస్తున్నారని, ఫలితంగా రిజర్వేషన్ ఉన్నవారికి సొంత వ్యాపారంలో అభివృద్ధి చెందలనే వారు ఆర్థిక సమస్యలో వున్నవారు బలహీన వర్గాలకు చెందినవారు కాబట్టి రిజర్వేషన్ మద్యం దుకాణాల వారికి ధరఖాస్తు రుసుములో 50శాతం రాయితీని ఇవ్వాలని కోరారు. ఆ విధంగా ఇచ్చినట్లయితే రిజర్వేషన్ దుకాణాలవారికి ఎంతో మేలుజరుగుతుందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి రిజర్వేషన్ లో ఉన్న మద్యం దుకాణాలన్నింటికీ దరఖాస్తు రుసుములో 50శాతం రాయితీ ఇచ్చే విదంగా చూడాలని కోరారు.

## రిజర్వేషన్లను అడ్డుకోవడం వల్లనే బిసిలకు అన్యాయం

**చిక్కడపల్లి, అక్టోబరు 9 ప్రభాతవార్త:** బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడం వల్లనే బీసీలకు అన్యాయం చేశారని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.వి.రమణ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారని, రాష్ట్రపతికి, గవర్నర్ కి ఆమోదం కొరకు పంపారని, 6 నెలలు అయినప్పటికీ బిజెపి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్లనే హైకోర్టులో స్థానిక సంస్థల ఎన్నికలపై స్టే ఇచ్చారని, రిజర్వేషన్లు ఇవ్వడానికి మాత్రం రాత్రికి రాత్రే నిర్ణయం తీసుకున్నారని, ఉన్నత కులాల వారి మీద ఉన్న ప్రేమ బీసీల పట్ల లేదనేది అర్థమవుతుంది. బీసీ ప్రధానిగా చెబుతున్న మోడీ బీసీలకు అన్యాయం చేస్తున్నారన్నారని వాపోయారు.

## ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ,ఫతేనగర్ లింక్ రోడ్డుపైనే వాహనాల అక్రమ పార్కింగ్

-ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్న వాహనాలు
-రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారిందంటున్న పలు బస్తీల వాసులు..
-పట్టించుకోని ట్రాఫిక్ పోలీసు అధికారులు

**బేగంపేట అక్టోబరు 9,ప్రభాతవార్త**

ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ఉన్న ఓ ప్రయివేటు పాఠశాల నిర్వాకం పలు బస్తీల వాసులకు తలనొప్పిగా మారింది.నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆ పాఠశాలకు విద్యార్థులను తీసుకువచ్చిన వాహనాలు సమీపంలోని ఫతేనగర్ లింక్ రోడ్డును రెండు వైపులా ఆక్రమించి పార్కింగ్ చేస్తున్నారు.దీంతో పాటు పాఠశాల ముందు భాగంలో ఉన్న స్థలంలో సైతం కార్లు,బస్సులు పార్కింగ్ చేస్తున్నారు.ఇది చాలదన్నట్లు సమీపంలోని శ్రీకేసరీ హనుమాన్ ఆలయం ముందు రోడ్డుకు రెండు వైపులా వాహనాలు నిలిపి ఉంచుతున్నారు.దీంతో మాతాజీనగర్ ,బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ,వడ్డెర బస్తీ,బ్రాహ్మణవాడీ తదితర బస్తీ వాసులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు.అయితే పాఠశాలకు విద్యార్థులను తీసుకు వచ్చిన వ్యానులు,బస్సులు,కార్లు అన్నింటినీ ఫతేనగర్ రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తూ ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ జాం కు కారణమవుతున్నారని,ఈ విషయాన్ని పై బస్తీల వాసులు ఎన్ని సార్లు ట్రాఫిక్ అధికారుల దృష్టికి తీసుకు పోయినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు.అలాగే శ్రీకేసరి హనుమాన్,శ్రీకట్టమైసమ్మ అమ్మ వారి ఆలయం ముందు వాహనాలు నిలిపి ఉంచిన డ్రైవర్లు కార్లలోనే కూర్చుని గుట్కా నములుతూ ఆలయం ముందు ఉమ్ముతుండటం భక్తులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని భక్తులు ఆరోపిస్తున్నారు.కొందరు వాహనాల పక్కనే మద్యం సైతం సేవిస్తున్నారని పలువురు మహిళలు ఆందోళణ వ్యక్తం


ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ఫతేనగర్ బ్రిడ్జిపైన ,కేసరి హనుమాన్ ఆలయం ముందు రోడ్డు పైనే వాహనాలు పార్కింగ్.

చేస్తున్నారు.ఆలయం ముందు వాహనాలలో కూర్చుని అసభ్యకరంగా చూస్తుండటం పై మహిళా భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పై బస్తీలలో ఉన్న ప్రజలు ఎక్కువగా క్యాబ్,ఆటో డ్రైవర్లుగా ఉపాధి పొందుతుండటం, మరికొందరు రోజు వారి పనులకు వెళ్తుంటారు.బ్రిడ్జి కింద, ఫతేనగర్ లింక్ రోడ్డుపై వాహనాల అక్రమ పార్కింగ్ తో నిత్యం ఉదయం,సాయంత్రం సమయంలో ట్రాఫిక్ జాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆరోపిస్తున్నారు.ఇప్పటి కైనా సంబంధిత శాఖాధికారులు పోలీసు అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి సమస్య పరిష్కరించకపోతే స్థానికులతో పెద్ద ఎత్తున ఆందోళణ చేస్తామని కాంగ్రెస్ నాయకులు నసీరుద్దీన్ (అడ్డూ) హెచ్చరించారు. సంబంధిత పాఠశాలకు వెనుక వైపు స్థలం ఉందని, పాఠశాలకు విద్యార్థులను తీసుకు వచ్చే వాహనాలను పాఠశాల స్థలంలోనే పార్కింగ్ చేసుకోవాలని,ఇలా రోడ్లపై పార్కింగ్ చేసి పలు బస్తీల ప్రజలకు ఇబ్బందులు కల్గించడం ఏంటని అడ్డూ ప్రశ్నించారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని ఆయన డిమాండ్ చేసారు.

## బస్తీ బాటతో సంస్థ అంతర్గత సామర్థ్యం మెరుగు

### టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ


మెహదీపట్నం డివిజన్‌లో పర్యటిస్తున్న సిఎండీ ముషారఫ్, డైరెక్టర్ నర్సింహులు, సిఈ ప్రభాకర్, ఎస్ఈ వెంకన్న తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:**

బస్తీబాట కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడం వలన క్షేత్రస్థాయిలోని డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్‌లో గల చిన్న చిన్న లోపాలు సైతం తెలుస్తాయని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ సిఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. ఈమేరకు గురువారం ఆకస్మిక తనిఖీల్లో భాగంగా, మెహదీ పట్నం డివిజన్ లో విద్యుత్ అధికారులు నిర్వహిస్తున్న బస్తీ బాట కార్యక్రమంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. డివిజన్ పరిధిలోని అయోధ్య నగర్, జాన్జర్ కాలనీ, సంతోష్ నగర్, రెతిబౌలి ప్రాంతాల్లో కాలి నడకన తిరుగుతూ నెట్వర్క్‌ను తనిఖీ చేశారు. ఎక్కడన్నా ప్రమాదకరంగా నున్న ఎల్‌టిఓవర్ హెడ్ కండక్టర్ల స్థానంలో ఎయిర్ బంచ్డ్ కేబుల్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. లోడ్ గ్రోత్ ఉన్న ప్రాంతాల్లో అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీఎండీ తో పాటు, సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్) డా. నరసింహులు, మెట్రో జోన్ సిఈ ప్రభాకర్, సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న, డిఈ సుధీర్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పెంచిన ఆర్టీసి బస్సు ఛార్జీలను ఉపసంహరించుకోవాలి : సాయి కిరణ్

**చార్మినార్,అక్టోబరు 9 ప్రభాతవార్త :** పెంచిన ఆర్టీసి బస్సు ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని కిషన్ బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలను పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపిందని, ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేర్చటంలో విఫలమైందని ఆయన విమర్శించారు.ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని,రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ది చెప్ప నున్నారని ఆయన తెలిపారు.వెంటనే ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని సాయి కిరణ్ డిమాండ్ చేశారు.

## కార్పొరేట్ స్థాయి వైద్యం పేదవారికి అందించాలి : ఎమ్మెల్యే

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 09, ప్రభాతవార్త :**

ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకుగాను వైద్యులు తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయిత్రి నగర్‌లో ఏర్పాటు చేసిన నవయుగ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని స్థానిక కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అభిపాజ్ షేక్,డా.ప్రవీణా పాల్గొన్నారు.

## ఏడాదిగా వెలగని హైమాస్ట్ లైట్లు

**చార్మినార్,అక్టోబరు 9 ప్రభాతవార్త :**


ఘాన్సీ బజార్ రహదారిలో వృధాగా పడి ఉన్న హైమాస్ట్ లైట్లు

ఘాన్సీ బజార్‌లోని హై మాస్ట్ లైట్లు దాదాపు సంవత్సరం నుంచి వెలగనందున ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఘాన్సీ బజార్ నుంచి హైకోర్టు రహదారికి వెళ్లె మార్గం కావటంతో నిత్యం రహదారి రద్దీగా ఉంటుంది.మరో వైపు వందలాది వస్త్రాల దుకాణాలు ఉన్నాయి.జంట నగరాలలోనిప్రజలు ఘాన్సీ బజార్‌లో వస్త్రాలు ఖరీదు చేయటానికి వస్తుంటారు.ఘాన్సీ బజార్ హైకోర్టు రహదారిలో ఉన్న హైమాస్ట్ లైట్లు చెడి పోవటం తో గత సంవత్సరం నుంచి వెలగటం లేదు.రాత్రి వేళల్లో చీకటిలో ప్రయాణం చేస్తున్న సమయంలో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు.మరో వైపు రహదారి గుంతలు మయంగా మారటంతో చీకటిలో వాహనదారులు తమ వాహనాలను అదుపు చేయలేక గుంతలలో జారిపడి గాయాల పాలవుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఘాన్సీ బజార్ నుంచి హైకోర్టుకు వెళ్లె రహదారిలో ఉన్న హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు అంబేద్కర్ వర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

**జూబ్లీహిల్స్, అక్టోబరు 9, ప్రభాతవార్తః**

అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం (నేడు) రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఎస్‌సీఐ) సహకారంతో 'స్టయిఫండ్ బేస్డ్ అప్రెంటి షిప్ ప్రోగ్రామ్'లో చేరిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రాం కింద నమోదు చేసుకున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ఈ డ్రైవ్‌లో ఎనిమిది ప్రముల రిటైల్ సంస్థలు పాల్గొంటున్నాయన్నారు.

## వైభవంగా శ్రీ సర్బోజ్జయినీ కాళీ పూజ

**చార్మినార్,అక్టోబరు 9 ప్రభాతవార్త :** హైదరాబాద్ బెంగాలీ స్వర్ణకార శిల్పి వివేకానంద కాళీ మందిరం కమిటి ఆధ్వర్యంలో అక్టోబరు నెల 20వ తేదీన రంగారెడ్డి జిల్లా, శంషాబాద్‌లోని నరకుడ బెంగాలీ స్వర్ణకార శిల్పి వివేకానంద కాళీ మందిరంలో అత్యంత వైభవంగా శ్రీ సర్బోజ్జయినీ కాళీ పూజను నిర్వహించనున్నామని మందిరం కమిటి ప్రతినిధి బరుణ్ తెలిపారు.ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడ శ్రీ కాళీ పూజను జరుపుతున్నామని ఆయన తెలియజేశారు.ఈ సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.


## CLASSIFIEDS

### CHANGE OF NAME

★ I, Vikas Kumar Singh Residing, at Flat No.101, Excel Residency, Indrapuri Railway Colony, Nehru Nagar, West Marredpally, Secunderabad, Hyderabad Dist. Corrected and Changed My Daughter's Name as **Bhoomikaa Singh** instead of **Akshata Singh** for all records purpose.

### గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## PUBLIC NOTICE

Take notice that my client is intending to enter into a Joint Development Agreement cum GPA with Shri.S.Narender, S/o: Late Sree Ramulu & Others, Residing at Jiyaguda, Hyderabad, Telangana who have represented to be the owners of land admeasuring 5 acres in Sy.No:197(P), Yapral, Secunderabad.

**SCHEDULE OF PROPERTY**

All that part and parcel of undivided land admeasuring 5 Acre in Sy.No: 197 (P) situated in Yapral (V), Malkajgiri Mandal, Medchal District and bounded as follows:
NORTH : Proposed 100 Feet Wide Road
SOUTH : Part of Land in Sy.No: 197
EAST : Part of Land in Sy.No: 197
WEST : Part of Land in Sy.No: 197

Take notice that any and all person/ persons/ bodies or entities claiming any rights or interest in the said property or any part thereof by way of sale, gift, lease, inheritance, exchange, mortgage, charge, lien, trust, possession, easement, attachment or otherwise howsoever in the said property or have any objections to the execution of the said Joint Development Agreement cum GPA should come forward within a period of 10 days from the date of publication of the present notice.

Take further notice that any claim which is received after the said date i.e., within 10 days from the date of publication of this notice shall be deemed to be forfeited and the said Joint Development Agreement cum GPA will be completed, without any reference to such claim and the same, if any, shall be considered as waived.

Take notice that the claims if any have to be sent to the following address:

**Sri Ram & Co. Law Offices,**
Office at Plot No.1188, Third Floor, Road No. 45, Jubilee Hills, Hyderabad – 500033.

**IN THE COURT OF HON'BLE XXI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT, AT : HYDERABAD**
**OS. No. 4105 Of 2025**

BETWEEN:
**Smt. Qairunissa Begum and others ...Petitioner**
// AND //
**1. The Tahsildar**, Khairatabad,
**2. All concerned ...Respondent**

Whereas the plaintiffs herein have instituted the above suit OS No. 4105/2025 for declaration, to declare that the plaintiffs as the legal heirs of the deceased late **Mr. Shabbir Ahmed Khan** and the abovesuit is posted on **24-10-2025** for appearance of the defendants. Take notice that if anybody is/are having any objections they may appear before the Hon'ble XXI Junior Civil Judge, CCC, Hyderabad on **24-10-2025 at 10.30 am** either in person or through a counsel, duty instructed failing which the matter will be decided on merits.

"By Order of the Court"
**Sd/- K. Muralidhar**
**Advocate**
302B, Mustafa Towers, Lakdikapool, Hyderabad
**Ph No. 9391104331**

**IN THE COURT OF THE HONBLE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT : HYDERABAD.**
**O.S. No. 3198 OF 2025**

Between:
**1. Kandamuri Savithri,** W/o Late Kandamuri Krishna
**2. G. Jhansi,** D/o Late Kandamuri Krishna, W/o. G. Kiran,
**3. K. Bhavani,** D/o Late Kandamuri Krishna, W/o. K. Sudheer,
**4. Kandamuri Mounika,** D/o Late Kandamuri Krishna,
All 1 to 4 plaintiffs are R/o 8-3-825/A, Srinagar Colony, Yellareddy guda, Hyderabad, Telangana. **...Plaintiffs**
And
**1. The Tahsildar,** MRO, Hyderabad.
**2. All Concerned ...Defendants**

Take notice that, the above named Plaintiffs filed a Suit before the aforesaid Hon'ble Court to declare them as the only Legal Heirs of deceased Late Kandamuri Krishna S/o Late Kandamuri Yellaiah. The said case is posted to **12-11-2025 at 10:30 am,** for defendants appearance, if anybody have any objection/s in the above said matter, the said person/s are hereby directed to appear before the above said Hon'ble Court in Person/s or through your Advocate failing which, the suit will be decided Ex-parte.

(BY ORDER OF THE COURT)
**K. SATYA PRADEEP, Advocate**
H.No.8-3-231 A/40, Near Melco Ice Cream Shop, Sri Krishna Nagar, Yousufguda, Hyderabad, 500045.

**IN THE COURT OF THE I ADDITIONAL CHIEF JUDGE : CITY CIVIL COURT AT : SECUNDERABAD**
**M.H.O.P NO. 12 OF 2025**

Between
**1) K. Bhagya Laxmi,** D/o. Late Anand Rao & Late Smt. K.Anasuya
**2) K. Jayalaxmi** rep by her younger sister & Natural Guardian K. Bhagya Laxmi, D/o. Late Anand Rao & Late Smt. K.Anasuya **...Petitioners**
AND
**1) Department of Post,** rep by its Senior Superintendent
**2) Inspector of Posts**
**3) All Concerned ...Respondents**
To,
**All Concerned**

Please take notice that the above M.H.O.P is filed by the Petitioners to appoint and declare the Petitioner No.1 as Next Friend of Petitioner No.2 to apply for pension of her mother to the Petitioner No.2 (K. Jayalaxmi) before the Respondent No.1 & 2 and to collect the same and utilize the same for the welfare of Petitioner No.2 and to issue consequential directions to the Respondent No.1 & 2 to issue pension in favour of the Petitioner No.2 of the deceased mother K. Anasuya and the same is posted to **22/10/2025** for appearance in the abovesaid Court at **10:30 a.m** if anyone wants to defend the said M.H.O.P, shall attend the court in person or through counsel. Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined.

( BY ORDER OF THE COURT )
**Muthyampeta Kiran**
**Advocate**
3-9-239, Akula Narayana Colony, Near Santoshi Mata Temple, Picket, Secunderabad-26. **Ph:7893465311**
**Counsel for Plaintiffs**

## అలయ్ బలయ్ కార్యక్రమాలు ఆత్మీయతను పెంపొందిస్తాయి

**: పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య**



సమావేశంలో ప్రసంగిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ రెడ్డి, చిత్రంలో పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 9, ప్రభాతవార్త:**
అలయ్ బలయ్ కార్యక్రమాలు ఆత్మీయతను పెంపొందిస్తాయని పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య పేర్కొన్నారు. బుధవారం సలీంనగర్ లో తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లలో ఐక్యతను పెంపొందించేందుకు అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు. పెన్షనర్లు ఐక్యంగా ఉండి వారి హక్కులను సాధించుకోవాలని ఆలిండియా స్టేట్స్ పెన్షనర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. ఐకమత్యమే బలమని, సమిష్టి కృషితో దేనినైనా సాధించవచ్చునని తెలిపారు. పెండింగ్ లో ఉన్న పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. భరత్ రెడ్డి సెక్రటరీ జనరల్ చోలా ఓం ప్రకాష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ యూనిట్ అధ్యక్షుడు పున్ రెడ్డి కృష్ణారెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి జి. ప్రసాదరావు, గౌరవ అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి ఉపాధ్యక్షులు దామోదర్ రావు, వరూధిని, కనకయ్య, సుదర్శన్ రెడ్డి, మోహన్ సింగ్, ప్రసాద్, సంయుక్త కార్యదర్శి శంకరయ్య, నాగమణి, వెంకటయ్య, యాదగిరిరెడ్డి, కృష్ణమూర్తి, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయం అభివృద్ధికి కృషి : చైర్మన్ బాబు శ్రీనివాస్



ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన నియామకపు ఉత్తరాలను కమిటీ సభ్యులకు అందజేస్తున్న దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట,అక్టోబర్ 8, ప్రభాతవార్త:**
మలక్ పేట్ లోని శ్రీ పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని దేవాలయం నూతన కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీ పోచమ్మ దేవాలయంలో చైర్మన్ బాబు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించి ఎండోమెంట్ దీప్తి కమిషనర్ జారీ చేసిన ధర్మకర్తల నియామక పత్రాలను ఆలయ చైర్మన్ బాబు శ్రీనివాస్ సభ్యులు అందరికి అందజేశారు. ఈ సందర్భంగా బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ సభ్యులందరూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు చౌకి రవికుమార్ పటేల్, శ్రీనివాస్ గుప్తా, శివకుమార్ గౌడ్, నాయకులు బుర్ర బాలరాజ్ గౌడ్, మోహన్, అర్చకులు శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కేజీ నుంచి పదవ తరగతి వరకు ఉచిత విద్య

**: మహదవీయ కమిటీ అధ్యక్షుడు మునవర్ ఖాన్**



సమావేశంలో ప్రసంగిస్తున్న మార్కాజి అంజుమన్ ఇ మహాదవీయ కమిటీ అధ్యక్షుడు మునావర్ ఖాన్ తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 9, ప్రభాతవార్త:**
కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకు చంచల్ గూడ లోని మార్కజీ అంజుమన్ ఇ మాహదవియ కమిటీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫర హై స్కూల్ లో ఉచిత విద్యను అందిస్తున్నామని మార్కజీ అంజుమన్ ఇ మహదవియ కమిటీ అధ్యక్షుడు మునావర్ ఖాన్ పేర్కొన్నారు. సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫర హై స్కూల్లో 726 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, కేజీ నుంచి పదవ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అపెక్స్ ద స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ పాఠశాలలో సీబీఎస్ఇ సిలబస్ ను కూడా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రతినెల తమ కమిటీకి చెందిన ఫంక్షన్ హాల్ లో ఐదు వివాహాలను ఉచితంగా జరిపిస్తున్నామని వివరించారు. త్వరలో మెటర్నిటి జనరల్ ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సంస్థ పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి పలువురు విరాళాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ అలీ అషరఫ్, మహమ్మద్ నెహమతుల్లా, కోశాధికారి సయ్యద్ అబ్దుల్ హమ్ మునావర్, సెక్రెటరీ మహమ్మద్ దావూద్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## జెకె కాలనీలో ఆర్సీసీ పైప్‌లైన్ పనులు పరిశీలించిన కార్పొరేటర్



**నేరెడ్ మెట్, అక్టోబర్ 9,ప్రభాతవార్త**
వినాయక నగర్ డివిజన్ సమగ్రబి వృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. వినాయక్ నగర్ డివిజన్ జెకె కాలనీలో ప్రతీ వర్షాకాలంలో వరద నీరు ముంచెత్తడం, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఈ సమస్య పరిష్కారానికి సుమారు రూ. 80 లక్షల వ్యయంతో ఆర్సీసీ పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు స్థానిక కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి తెలిపారు.గురువారం కాలనీలో పర్యటించిన ఆమె పైప్‌లైన్ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,"ప్రతి ఏడాది వర్షాల సమయంలో కాలనీలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆర్సీసీ పైప్‌లైన్ వేయిస్తున్నాం. పనులు త్వరలో ప్రారంభమై వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ నవీన్, సూపర్‌వైజర్లు సాగర్, వెంకటేష్, బీజేపీ నాయకులు సాయిసురేష్, జగదీశ్ చారి, శివగౌడ్, అలాగే కాలనీవాసులు పాల్గొన్నారు.

# డిఫెన్స్ కాలనీ సొసైటీపై భారీ భూకబ్జా ఆరోపణలు

### - లీజుల పేరుతో వందల కోట్లు నష్టం
### -అధికారుల నిర్లక్ష్యం వల్లే పరిస్థితి

**నేరెడ్ మెట్, అక్టోబర్ 9(ప్రభాతవార్త:**
డిఫెన్స్ కాలనీ హౌసింగ్ సొసైటీలో అక్రమ లీజులు, భూకబ్జాలతో కోట్ల రూపాయల నష్టం కలిగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లీజుల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించడంతో పాటు, సొసైటీకి చెందిన అనేక భూములను తమ కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లకు మళ్లించినట్లు సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. సెక్షన్ 51 విచారణలో బయటపడ్డ అక్రమాలు సొసైటీకి చెందిన 649, 652 నంబర్ ప్లాట్లు , డ్రైనేజీ కోసం ఉంచిన భూమిని కమిటీ సభ్యులు తమ డ్రైవర్‌కు దీర్ఘకాలిక లీజు కింద కేటాయించారు. ఈ కేటాయింపులు రద్దు చేయాలని విచారణలో తేలినా, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, జిల్లా సహకార అధికారి చర్యలు తీసుకోకపోవడంతో జీహెచ్ఎంసీకి, సొసైటీకి రూ.1300 కోట్ల నష్టం వాటిల్లింది.హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా చర్యలు శూన్యం... జూశ్ వ్పి.23957 ఆ 2007 కేసులో హైకోర్టు న్యాయమూర్తి జె. శ్రీనివాస్ రావు, 706, 177, 486, 426, 160, 126, 3తి, 697తి, 848తి, 770తీ, 13తి, 681ది, 779తి, 720తి, 722తి ప్లాట్లపై విచారణ చేసి, మూడు నెలల్లో చర్యలు తీసుకోవాలని కోఆపరేటివ్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్లాట్లు సొసైటీకి సభ్యులు కాని వ్యక్తులకు అక్రమంగా కేటాయించబడినట్లు రుజువైంది. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వేచి ఉన్న సభ్యులకు కేటాయించాల్సిన ప్లాట్లు ఇప్పటికీ అక్రమంగా ఉన్నవారి చేతుల్లోనే ఉన్నాయి. జిల్లా సహకార అధికారి, సొసైటీ ప్రస్తుత అధ్యక్షుడు ఐ.ఏ. రాజారావు తన ప్లాట్‌ను 2013లో తన కూతురి పేరుకు రిజిస్టర్ చేయడంతో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ప్రస్తుత కార్యదర్శి డి. నాగేశ్వరరావు 75 గజాల ప్లాట్‌ను అక్రమంగా ఆక్రమించి, లీజు సొమ్ము వసూలు చేసి సొసైటీకి రూ.35 లక్షల నష్టం కలిగించారని గుర్తించి సస్పెండ్ చేశారు. అదేవిధంగా, 1979 ఎన్నికల జాబితా ప్రకారం సభ్యుడైన బి. నాగేశ్వరరావు సభ్యత్వాన్ని కూడా అక్రమంగా తన పేరుకు మళ్లించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.లీజు సొమ్ము దాచిపెట్టడం - ఖజాంచీపై అవిశ్వాసంఫంక్షన్ హాల్‌కు సంబంధించి సంవత్సరం లీజు, అద్దె సొమ్మును కూడా అధ్యక్షుడు, కార్యదర్శి తమ వద్దే ఉంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక, సెప్టెంబర్ 30, 2025న, తమ సస్పెన్షన్ , పదవి తొలగింపుల తరువాత కూడా, ఖజాంచీ అనుమతి లేకుండా రూ.1.5 లక్షలు డ్రా చేసినట్లు సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనికి ప్రతిగా, అక్రమాలకు వ్యతిరేకంగా నిలిచిన ఖజాంచీపై అవిశ్వాస తీర్మానం కూడా తెచ్చారని సభ్యులు వెల్లడించారు.అధికారుల నిర్లక్ష్యం కారణంసొసైటీ సభ్యులు మాట్లాడుతూ,"విచారణల్లో అన్ని అక్రమాలు బయటపడ్డా, అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే పరిస్థితి ఇంత దారుణంగా మారిందన్నారు. వందల కోట్లు విలువైన భూములు అక్రమంగా పోయాయి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని నష్టపోయిన భూములను తిరిగి సాధించాలని అని డిమాండ్ చేస్తున్నారు.





## ముంపు కాలనీల సమస్య పరిష్కారానికి త్వరలో ఓపెన్ డ్రైన్ నిర్మాణం : ఈటల

**వనస్థలిపురం. అక్టోబర్.9.ప్రభాతవార్త**
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్లోని ముంపు కాలనీలకు శాశ్వత పరిష్కారం చేయాలని బి.ఎన్.రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ దృష్టికి తీసుకురావడంతో గురువారం బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ముంపు కాలనీలలో పర్యటించారు. కురిసిన భారీ వర్షాలతో వినూత్న కాలనీ,గాంధీ నగర్ సౌత్, అఖిలాండేశ్వరి కాలనీ, స్నేహమయి నగర్ కాలనీ,పివిఆర్ కాలనీ తదితర పరిసర కాలనీలో ముంపుకు గురైన నేపథ్యంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మరియు రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి లకు సమస్యను వివరించి ముంపు సమస్య ప్రాంతంలో తిప్పి చూపించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అడవి ప్రాంతం నుంచి భారీ వరద రావడంతో అడ్డుగా ఉన్న కట్ట తెగి వినూత్న కాలనీకుండా వరద నీరు ప్రవేశించింది అన్నారు. తద్వారా వినూత్న నగర్ గాంధీనగర్ సౌత్ అఖిలాండేశ్వరి కాలనీ స్నేహమే నగర్ పివిఆర్ కాలనీ పద్మావతి కాలనీలు నీట మునిగేయన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం కోసం భారీ స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం చెయ్యడం ద్వారా వరదను అరికట్టవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ ముంపుకు గురైన కాలనీలలో పర్యటించి కాలనీ వాసులతో సమస్యను అడిగి తెలుసుకోవడం జరిగింది సంబంధించిన జలమండలి, జిహెచ్ఎంసి, ఇరిగేషన్, హైడ్రా అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్య శాశ్వత పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు,జలమండలి జి.ఎం మహేందర్, ఇంజనీరింగ్ విభాగం నిని రమేష్ బాబు, డి ఈ దామోదర్ రావు,ఇరిగేషన్ డి ఈ శుక్లజ, జలమండలి డీజీఎం రాజగోపాల్, ఏ ఈ సతీష్, ఇంజనీరింగ్ ఏఈ కార్తీక్, జలమండలి మేనేజర్ భవ్య మరియు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు, నాయకులు, తదితరులు ఉన్నారు.



# రూ.75 లక్షలతో రోడ్ల అభివృద్ధి పనులు : మల్‌రెడ్డి రాంరెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:**
ఆర్టీసీ కాలనీలో రూ.75 లక్షల నిధులతో రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో రూ.75 లక్షల జిహెచ్ఎంసి నిధులతో రోడ్‌నెంబర్ 2, 4లో రోడ్డు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌తో కలిసి రాంరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత 2 సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధు యాష్కీ గౌడ్ సహకారంతో నియోజక వర్గంలో సుమారు రూ.150 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కెసిఆర్ హయాంలో ఎల్బీనగర్ లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేవు అన్నారు.పార్టీలకు అతీతంగా ప్రజల అభివృద్దే మా లక్ష్యమని, కాలనీ ప్రజలు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రోడ్ల సమస్యకు ఇప్పుడు పూర్తి పరిష్కారం లభిస్తుందన్నారు.గతంలో రేవంత్ రెడ్డి ఎంపీ గా ఉన్నప్పుడు రూ.96 లక్షల ఎంపీ నిధులతో డ్రైనేజీ పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక సంస్థలకు సరైన ప్రాధాన్యం, నిధులు వస్తున్నాయన్నారు. ప్రతి ప్రాంతంలో సమాన అభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి దృష్టి సాధించార



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, పవన్‌కుమార్

న్నారు. కెసిఆర్ పాలనలో స్థానిక సంస్థలను పట్టించుకునే పాపాన పోలేదని విమర్శించారు. కార్పొరేటర్ నాయికోటి పవన్ మాట్లాడుతూ ఆర్టీసీ కాలనీలో రూ.75 లక్షల జిహెచ్ఎంసి నిధులతో రోడ్ల పనులు ప్రారంభించడం ప్రజల దీర్ఘకాల కోరిక నెరవేరిందన్నారు. రోడ్డు అభివృద్ధి కార్యక్రమానికి మల్‌రెడ్డి రాంరెడ్డి సహకారం అందించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కిషోర్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి, టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, కాలనీ వాసులు మహేష్‌రెడ్డి, పెంటారెడ్డి, కాంగ్రెస్ నాయకులు షరీఫ్, జహంగీర్‌బాబుగౌడ్, కృష్ణారెడ్డి, సామలేటి సాయి, తిగుళ్ల యాదగిరి, మారుపాకల సాంబయ్యగౌడ్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# వినాయక్ నగర్‌లో స్టామ్ వాటర్ డ్రైన్ పనులు వేగవంతం

**నేరెడ్ మెట్, అక్టోబర్ 9,ప్రభాతవార్త**
మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని వినాయక్ నగర్ డివిజన్‌లో భారీ వర్షాల సమయంలో తరచూ జలమయం అయ్యే సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో సంతోషి మాత దేవాలయం నుండి నాగదేవత దేవాలయం వరకు, వయా దీన్ దయాల్ నగర్ మెయిన్ రోడ్డుపై 1000 మిల్లీమీటర్ల వ్యాసంలో ఆర్‌సీసీ స్టామ్ వాటర్ డ్రైన్ పైప్‌లైన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.85 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక ప్రజలకు వర్షాకాలంలో కలిగే ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఎమ్మెల్యే తెలిపారు.

**స్థానికుల విజ్ఞప్తి - ఎమ్మెల్యే స్పందన**

నిర్మాణ నాణ్యతపై శ్రద్ధ వహించాలని, లెవెల్ తేడాలు లేకుండా పనులు కొనసాగించాలని కోరుతూ కాలనీవాసులు ఇటీవల మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిశారు. వారి సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో మాట్లాడి పనుల ప్రగతిని స్వయంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ ఇంజినీర్ శ్రీమతి లౌక్యకు ఆయన తగిన సూచనలు ఇస్తూ, నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. అలాగే పనులు త్వరితగతిన పూర్తి కావడానికి అధికారులంతా సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న, తులసి సురేష్, హేమంత్ రెడ్డి, సర్వేశ్ యాదవ్, బాలకృష్ణ, ఎమ్మార్ శ్రీను, పేపర్ శ్రీను, చందు, సంపత్ యాదవ్, ఉమేష్, శ్రీకాంత్, వినీత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కాలనీవాసులు శ్రావన్‌తోపాటు పలువురు కూడా హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.అభివృద్ధిపై ప్రజల సంతృప్తిఎమ్మెల్యే వెంటనే స్పందించి అధికారులు సీరియస్‌గా పర్యవేక్షణ చేయడంతో పనులు నాణ్యంగా జరుగుతాయని మేము నమ్ముతున్నాం. కాలనీలో సమస్యలు తగ్గుతాయని ఆశిస్తున్నాం" అని స్థానికులు పేర్కొన్నారు.



## బస్సు భవన్ బయలుదేరిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అరెస్టు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** ఆర్టీసీ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బస్‌భవన్ బయలుదేరిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్టు చేశారు. బస్‌భవన్‌కి ఆర్టీసీ బస్సులో వెళ్తుండగా మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, శాసన మండలి సభ్యురాలు సురభివాణీదేవిలను మార్గమధ్యలో పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని అంబర్ పేట దగ్గర విడుదల చేయగా అనంతరం వారు బస్ భవన్ వెళ్లారు. కాగా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలను కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులు అడ్డుపెట్టుకొని కక్షపూరితంగా అరెస్టులు చేస్తుందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు ఆందోళనకు దిగారు.



ఆర్టీసీ బస్సులో సబితా ఇంద్రారెడ్డి సుధీర్‌రెడ్డి, సురభివాణి

## ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



బీఆర్ఎస్ నాయకులు మడిగెల విజయభాస్కర్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

**మలక్ పేట ,అక్టోబర్ 9, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందని మలక్ పేట నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాడిగెల విజయ్ భాస్కర్ రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ తలపెట్టిన ఛలో బస్ భవన్ కార్యక్రమానికి వెళ్ళేందుకు సిద్ధమైన మలక్ పేట బిఆర్ఎస్ పార్టీ నాయకులు మడిగెల విజయ భాస్కర్ రెడ్డి నివాసానికి మలక్ పేట పోలీసులు విచ్చేసి అతడిని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా జరగాల్సిన ప్రజా కార్యక్రమానికి పోలీసులు అడ్డంకులు కల్పించారని పేర్కొన్నారు. పెంచిన చార్జీలపై ప్రజలకు జవాబు చెప్పలేని ప్రభుత్వము అరెస్టులు చేస్తుందని, బస్సు చార్జీలను తగ్గించే వరకు బిఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## హయత్‌నగర్‌లో ప్రారంభమైన బొడ్రాయి ఉత్సవం

**హయత్‌నగర్ అక్టోబర్ 9,ప్రభాతవార్త:** హయత్ నగర్ లో బొడ్రాయి (నాభి శిల) ప్రతిష్టాపనా మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభ మయ్యింది. దసరా ఉత్సవాల స్థలంలో బొడ్రాయిని ప్రతిష్టించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ తెలిపారు. గురువారం గ్రామ వీధుల్లో బొడ్రాయి ఊరేగింపు నిర్వహించగా... శుక్రవారం గ్రామ పోలి మేరలోని అన్ని గ్రామ దేవతల ఆలయాల్లో పూజలు నిర్వహిస్తారని వివరించారు. శనివారం రాత్రి కుల వృత్తి దారుల సహకారంతో బైండ్ల పూజారుల చేతుల మీదుగా పొలిమేర చుట్టూ పొత్తి పోయడం జరుగు తుందన్నారు. ఆదివారం తెల్లవారుజామున 1.55 గంటలకు విగ్రహ ప్రాణ ప్రతిష్ట చేస్తారని, ఉదయం 11.52 గంటల నుండి భోనాల సమర్పణ ఉంటుందన్నారు. ఉత్సవాలకు పెద్ద ఎత్తున హాజరయ్యే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేశామని కార్పొరేటర్ తెలిపారు.

## ఓట్ చోరీ పై కాంగ్రెస్ సంతకాల సేకరణ:భాస్కర్‌రెడ్డి



సంతకాల సేకరణ చేస్తున్న భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** ఓట్ చోరీపై తెలంగాణ కాంగ్రెస్ కదం తొక్కిందని, ఊరూరా సంతకాల సేకరణ యుద్ధం మొదలైందని టీపీసీసీ సభ్యుడు దీప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ గ్రామ గ్రామాన చేపడుతున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశానుసారం మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో ఓట్ చోరికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు కల్పించిన ఓటు హక్కును కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, బీసీ నాయకుడు గట్ల రవీంద్ర, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్, రాజునాయక్, పగడాల ఎల్లయ్య, అక్బర్, కళ్యాణ్, సమద్, పటేల్, డాక్యారనాయక్, దుబ్బాక శేఖర్, పెద్దవూర సైదులు, నబీ, అశోక్, సలీం, రఫీ, విజయ్, రేణుక, మాధవి, అరుణ, రమ, లావణ్య, మంజుల, ఈశ్వరి, రజిత, కవిత, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# రాకేష్ కిశోర్ దిష్టిబొమ్మ దహనం



సిజెపై దాడి చేసిన రాకేష్ కిశోర్ దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న దళిత సంఘాల నాయకులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:**
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి ప్రయత్నించిన న్యాయవాది రాకేష్ కిశోర్ దిష్టిబొమ్మను గురువారం మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తాలో దహనం చేశారు. సుప్రీం కోర్టులో జరిగిన సంఘటనను ఖండించిన దళిత సంఘాలు ఘాతుకానికి పాల్పడిన రాకేష్ కిశోర్ దిష్టిబొమ్మను ఊరేగించి బాలాపూర్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయ వ్యవస్థకు సంబంధించిన ప్రధాన న్యాయమూర్తి పట్టే అనుచితంగా ప్రవర్తిస్తే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు. దాడి ఘటనను సుమోటాగా స్వీకరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం సిగ్గుచేటని వారు విమర్శించారు. సిజెపై దాడిని భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడిగా భావిస్తున్నామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బి. సత్యనారాయణ, ఎంగల యాదగిరి, న్యాయవాది గురువయ్య, రాజలింగం, దాసరి బాబు, రవికుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడ కాలనీల్లో శానిటేషన్ పనులు చేపట్టాలి : రాఘవేందర్‌రెడ్డి



ఓపెన్ ప్లాట్లలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వర్షాల వల్ల ప్రజలకు సమస్యలు తలెత్తకుండా సానిటేషన్ పనులు చేపట్టాలని ఎఐసిసి తరుణ్ విభాగ్ ప్రాంతీయ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కార్పొరేషన్ అధికారులను కోరారు. గురువారం ఆయన 26వ డివిజన్ అల్మాస్‌గూడ ఎంఆర్ఆర్ కాలనీలో పర్యటించి సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు, ఓపెన్ ప్లాట్లల్లో నిలిచిన నీటి మడుగులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా ప్రజలకు అనారోగ్య సమస్యలు రాకుండా సానిటేషన్ పనులు చేపట్టాలనీ అదే విధంగా నిల్వ ఉన్న నీటి వల్ల ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాజు, మహేందర్, జగన్, సాయిబాబా, త్రిలోక్‌నాథ్‌రెడ్డి, ప్రశాంత్, నవీన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు



హౌస్ అరెస్టు అయిన మీర్‌పేట్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:**
పెంచిన ఆర్టీసి బస్సు ఛార్జీలను ఉపసంహరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ అధిష్టానవర్గం ఇచ్చిన ఛలో బస్ భవన్ కార్యక్రమానికి వెళ్ళడానికి సమాయత్తం అవుతున్న మహేశ్వరం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల బిఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. గురువారం తెల్లవారు జామునే మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి నివాసానికి వచ్చిన మీర్‌పేట్ పోలీసులు గృహనిర్బంధం చేశారు. అనంతరం ఛలో బస్ భవన్ కార్యక్రమానికి వెళ్ళకుండా కామేష్‌ను మీర్‌పేట్ పిఎస్‌కు తరలించి తర్వాత వదిలిపెట్టారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో కూడా నేతలను అరెస్టు చేసి విడిచి పెట్టారు. అయితే అరెస్టులను బిఆర్ఎస్ నాయకులు ఖండించారు.

## సర్వే నెం.103లో భూ ఆక్రమణను నిలిపివేయాలి

**ప్రజా సంక్షేమ సంఘం నాయకులు**



మేడిపల్లి సర్వే నంబర్ 103 లో భూ అక్రమాలను నిలిపివేయాలని ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంక్షేమ సంఘం నాయకులు తూళ్ళ భిక్షపతి గౌడ్, దేవ్ సింగ్ నాయక్ ,జైపాల్ రెడ్డి ,అశోక్ గౌడ్ తదితరులు

**మేడిపల్లి, అక్టోబర్ 9 ప్రభాతవార్త :**
పీర్జాదిగూడ మున్సిపాలిటి కార్పోరేషన్ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా 14వ డివిజన్లో మేడిపల్లి రెవిన్యూ పరిధిలోని సర్వే నెం.103లో భూ ఆక్రమణలు జరుగుతున్నవి.దొంగ పట్టాలను తయారుచేసుకొని ఇండ్లు లేకున్న పట్టాలపై బై నెంబర్లు వేసుకొని ఇంటి నెంబర్లు తెచ్చుకొని దానిని సేల్డీడ్ గా మార్చుకుని అమ్ముకుంటున్నారు.గతంలో మాజీ మంత్రి టి. దేవేందర్ గౌడ్ 179 పట్టాలు నిరుపేదలకు పంచారు. ఈ పట్టాలను ఆసరా చేసుకుని భూ ఆక్రమదారులు సొమ్ముచేసుకుంటున్నారు. ఈ విషయము గురించి గతంలో గ్రామ ప్రజలు ఎన్నో పిర్యాదులు చేసినప్పటికి ప్రభుత్వ అధికారులు పట్టించుకున్న ధాఖలాలు లేవు. కావున భూ ఆక్రమనదారులను గుర్తించి వారి చెర నుండి భూమిని తిరిగి తీసుకొని ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు, అవసరాలకు వినియోగించాలని అన్నారు. మేడిపల్లి వీరాంజనేయ స్వామి దేవస్థాన పరిదిలో ఉన్న స్థలంలో ప్రభుత్వ ప్రతిపాదిత ఎలక్ట్రిక్ వెహికిల్ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటును కూడా విరమించుకోవాలని ప్రజా సంక్షేమ సంఘం నాయకులు మేడిపల్లి ఎంఆర్ఓ కి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో తూళ్ళ బిక్షపతి గౌడ్, ఉడుతల బాలకృష్ణ గౌడ్, దేవ్ సింగ్ నాయక్, అశోక్ గౌడ్, జైపాల్ రెడ్డి, సంతోష్ గౌడ్, వెంకటేశ్ గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతలకు అందెలను విమర్శించే అర్హత లేదు : చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** అవినీతి అక్రమాలకు పాల్పడి ప్రజా ధనాన్ని, ప్రభుత్వ ఆస్తులను లూఠీ చేసిన బిఆర్ఎస్ నేతలకు మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్‌ను విమర్శించే అర్హత లేదని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు స్పష్టం చేశారు. గురువారం నాదర్‌గుల్‌లోని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి కేంద్ర కార్యాలయంలో పార్టీకి చెందిన పలువురు నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు బిఆర్ఎస్ నేతల తీరును దుయ్యబట్టారు. వాస్తవాలు మాట్లాడిన శ్రీరాములు యాదవ్‌పై బిఆర్ఎస్ నాయకులు చేసిన విమర్శలను వారు ఖండించారు. శరీరం ఒక చోట ఆత్మ మరోచోట అన్న చందంగా బిఆర్ఎస్‌లో ఉంటూ కాంగ్రెస్ వైపు చూసే బిఆర్ఎస్ నేతలు అందెలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమని వారన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై అందెల శ్రీరాములు యాదవ్ ఎప్పుడు అసందర్భ అనుచిత వ్యాఖ్యలు చేయలేదని వారు స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను శ్రీరాములు యాదవ్ ఎత్తి చూపితే రాజకీయాలు చేస్తున్నారని వారు విమర్శించారు. బిఆర్ఎస్‌కు చెందిన నాయకులు, అనుచరులు అవినీతికి పాల్పడలేదని సబితా ఇంద్రారెడ్డి ప్రకటించగలరా? అని వారు సవాల్ చేశారు. అందెల శ్రీరాములు యాదవ్ చేసిన వ్యాఖ్యలు సరైనవేనని వారు స్పష్టం చేశారు. అందెలపై విమర్శలు చేసిన వారు తామేందో తెలుసుకొని మాట్లాడాలని వారు హితవు పలికారు. మరోసారి తమ నాయకుడిని విమర్శించాలని చూస్తూ సహించేది లేదనీ అందరి చిట్టా విప్పుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన, నాయకులు నవారు శ్రీనివాస్ రెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, ఎలిగెశెట్టి సైదులు, రావుల మల్లేష్, కళ్లెం మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ నాయకులను ఎండగడుతున్న చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి: పక్కన పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గూడెపు ఇంద్రసేన తదితరులు